నవతెలంగాణ

1

ఆదిలాబాద్

ఆదివారం | అక్టోబర్ 22, 2023 | www.navatelangana.com

విధి నిర్వహణలో పోలీసుల సేవలు చిరస్మరణీయం

నవతెలంగాణ-ఉట్నూర్

విధి నిర్వహణలో పోలీసుల సేవలు చిరస్మరణీయమని ఎస్సై మనోహర్ అన్నారు. శనివారం పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. పోలీసుల అమరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మనోహర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు చేసిన త్యాగాలు ఎన్నటికీ మరచిపోలేనివన్నారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి, గాదిగూడ, నార్నూర్ ఎస్సైలు, సునీల్, మహేష్, రవికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



గర్భిణులకు, పిల్లలకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ - వాంకిడి

మండలంలోని బోర్దా, జైత్‌పూర్ గ్రామాల్లో గర్భిణులకు, పిల్లలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. టీకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి, వారు తీసుకునే జాగ్రత్తలపై సలహాలు, సూచనలు చేశారు. వైద్యశిబిరంలో జ్వరంతో బాధపడుతున్న వారికి మలేరియా, ఆర్‌డీటీ వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించినట్టు వైద్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కృపవాణి, భగవాన్‌దాస్, అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, పిల్లలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఎన్నికల వేళ సామాన్యుడికి డబ్బు రవాణా కష్టాలు..!

- ప్రత్యేక టీంలతో ప్రజలకు అవస్థలు
- జిల్లాలో రికవరీకి 43మంది డబ్బులు మళ్లింపు

మద్యం, డబ్బు ప్రవాహం లేని ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా రూ.50వేల కంటే ఎక్కువగా నగదు రవాణా కాకుండా చూసేలా అన్ని జిల్లాల ఎస్పీలు, కలెక్టర్లకు ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నగదు, మద్యం పంపిణీ కాకుండా అడ్డుకోవాలని సూచించింది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా ఇదే నిబంధన ఇప్పుడు సామాన్యులకు ఇబ్బందికరంగా మారుతోంది.

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో చాలా మందికి డిజిటల్ చెల్లింపులపై అవగాహన లేకపోవడంతో ప్రతిరోజు ప్రజలు అవసరాల కోసం నగదు వెంట తీసుకొని వెళ్లడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. అయితే ఇప్పుడు ఇదే వారి పాలిట శాపంగా మారుతోంది. జిల్లాలో ఏడు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పోలీసులు చేస్తున్న తనిఖీల్లో భాగంగా సామాన్యుడు తన అవసరానికి తీసుకువెళ్లే డబ్బులు కూడా రికవరీకి వెళుతున్నాయి. ఎన్నికలు తమకు కొత్త కష్టాలు తెచ్చాయంటూ వారు లబోదిబోమంటున్నారు.



వాహనాల తనిఖీ చేపడుతున్న ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు(ఫైల్)

ప్రత్యేక టీంలతో ప్రజలకు అవస్థలు

జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఏడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాటికి ప్రత్యేక టీంలు నియమించి తనిఖీ చేస్తున్నారు. దీనిలో పోలీస్ సిబ్బందితో పాటు రెవెన్యూ ఇతర విభాగాల అధికారులు కూడా ఉన్నారు. వీరు ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి డబ్బు ఉన్నట్లయితే వాటికి సంబంధించిన రశీదులు అడుగుతున్నారు. పెండ్లిళ్లు, ఆసుపత్రిల నిమిత్తం డబ్బులు తీసుకువెళ్తున్న సామాన్య ప్రజల దగ్గర రశీదులు లేకపోవడంతో ప్రత్యేక టీంలు అటువంటి వాటిని కూడా ఉపేక్షించడం లేదు. కొన్నింటికి రశీదులు ఉన్నప్పటికీ డబ్బులు సీజ్ చేయడం చర్చకు దారి తీసింది. ఎన్నికల వేళ ఏర్పాటు చేసిన ప్రత్యేక టీములతో అవస్థలు పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అవసరాల నిమిత్తం తీసుకువెళ్లే డబ్బులను సీజ్ చేయడంపై మండిపడుతున్నారు.

జిల్లాలో రికవరీకి 43 మంది డబ్బులు

జిల్లాలోని ఏడు చెక్‌పోస్టులలో ఈ నెల 9 నుండి ఇప్పటివరకు పట్టుకున్న వాటిలో 43 మంది డబ్బులు రికవరీకి వచ్చాయి. వారు సరైన పాత్రలు చూపించి రిలీజింగ్ ఆర్డర్ ప్రత్యేక టీంకు అందించి డబ్బులు తీసుకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే ఈ నెల 11న స్వాధీనం చేసుకున్న డబ్బులు కూడా 20 వరకు రిలీజింగ్ ఆర్డర్ ఇవ్వకపోవడంతో కార్యాలయాలు చుట్టూ తిరగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మార్గదర్శి చిట్ ఫండ్‌కు సంబంధించిన రూ.2.60లక్షలు కలెక్షన్ వాంకిడి నుండి తీసుకెళ్తుండగా బెండర చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక టీం పట్టుకుంది. రశీదులు చూపినా డబ్బులు సీజ్ చేశారని సదరు వ్యక్తి వాపోయాడు. జిల్లా కేంద్రంలోని భారత్ గ్యాస్ కంపెనీకి చెందిన వాంకిడి కలెక్షన్ తీసుకొస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కాగజ్‌నగర్ ఇండియన్ గ్యాస్ కంపెనీ ఖాతాదారులు రెబ్బెనలో ఉన్నారు. ప్రతిరోజులాగే గ్యాస్ సరఫరా చేసి 66 సిలిండర్లకు సంబంధించి రూ.64200 మొత్తాన్ని తీసుకొస్తుండగా డ్రైవర్ దగ్గర నుండి ఆ మొత్తాన్ని సొంతం చేసుకున్నారు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలా ప్రతిరోజు సామాన్యుడు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులను ఇదే విషయం అడగగా ప్రత్యేక టీంలు తమకు ఇస్తే తాము నగదును సీజ్ చేయడం మినహా ఏమీ చేయలేమని, కొన్ని ఇందులో సరైనవే ఉన్నాయని చెప్పడం ప్రత్యేక టీముల అత్యుత్సాహానికి అద్దం పడుతోంది. ఇదే విషయం ఎస్పీని అడగడానికి ప్రయత్నం చేయగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు. అయితే పట్టుకున్న 43మందిలో ఎవరు కూడా రాజకీయాలతో సంబంధం లేకపోవడం కొసమెరుపు.

ఆర్డర్ చేసిన నగ కొనడానికి వెళ్తున్నాం : సరిత బైస, జక్కులపెల్లి, రెబ్బెన



గత నెలలో బెల్లంపల్లిలోని సోని జువెలర్స్‌లో గోల్డ్ చైన్ ఆర్డర్ చేశాం. అది పూర్తయిందని సమాచారం అందుకొని రూ.60900 తీసుకుని బెల్లంపల్లి వెళ్తున్న క్రమంలో 15న బస్సు ఆపి గోలేటి వద్ద తనిఖీ చేశారు. తమ వద్ద ఉన్న రశీదు చూపినప్పటికీ వినకుండా డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుండి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాం.

వడ్లు అమ్మి నగదు తీసుకొస్తున్నా : రాకేష్, బొలెరో డ్రైవర్, రుద్రపూర్, బెజ్జూర్



తమ యజమానికి చెందిన 30 క్వింటాళ్ల వడ్లను బెల్లంపల్లి మణికంఠ రైస్ మిల్‌లో అమ్మి డబ్బులతో వస్తున్న క్రమంలో కాగజ్‌నగర్ వినయ్ గార్డెన్ వద్ద తనిఖీ చేసి డబ్బులు స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్లు యజమాని రాసిచ్చిన రశీదు చూపడంతో పాటు ఆయనతో మాట్లాడించినప్పటికీ వినలేదు. 15 నుండి డబ్బుల కోసం తిరుగుతున్నాను. ఎన్నికల వేళ ప్రజలను ఇబ్బంది పెట్టడం సరైన విధానం కాదు.

గ్యాస్ సరఫరా డబ్బులు స్వాధీనం చేసుకున్నారు : మీర్జా నదీమ్, కాగజ్‌నగర్



ప్రతిరోజు లాగే రెబ్బెనకు గ్యాస్ సరఫరా కోసం వెళ్లి 66 సిలిండర్లు సరఫరా చేసి రూ.64,200 నగదు తీసుకొని వస్తున్న క్రమంలో కాగజ్‌నగర్ మండలం వంజిరి వద్ద తనిఖీ చేసి మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. తాను సరఫరా చేసిన విధానాన్ని వివరించడంతోపాటు ఫోన్‌లోని అప్లికేషన్ ఓపెన్ చేసి ఎవరెవరికి సరఫరా చేశాననే విషయం కూడా తెలియజేశాను. అయినప్పటికీ పట్టించుకోలేదు. పోలీసులు సాధారణ ప్రజలను ఇబ్బంది పెట్టకూడదు.

పెండ్లి బట్టలు కొనడానికి డబ్బులతో వెళ్తున్నాం : సంధ్య సునీల్ పద్మావార్, చంద్రపూర్

తన కూతురు వివాహం నిశ్చయమవడంతో తాము ఈ నెల 11న కారులో చంద్రపూర్ నుండి వేములవాడకు వెళ్తుండగా బెండర చెక్‌పోస్ట్ వద్ద తమ వద్ద ఉన్న రూ.1.50లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేటలో పెళ్లి బట్టలు బాగుంటాయని తెలిసిన వారు చెప్పడంతో వేములవాడ దర్శనం తర్వాత సిద్దిపేట వెళ్లాలని అనుకున్నాం. పరిస్థితి ఇలా ఉందంటే మేము తెలంగాణ వైపు వచ్చేవారం కాదని వాపోయారు.

ఏ క్షణంలోనైనా జాబితా..!

- కాంగ్రెస్ రెండో లిస్టుపై సర్వత్రా ఉత్కంఠ
- ఇప్పటికే ప్రచారం ప్రారంభించిన ఆశావహులు
- తమకే టికెట్ వస్తుందని ఎవరికి వారు జనాల్లోకి
- ఎవరిని వరిస్తుందో నేడు వెల్లడయ్యే అవకాశం



కాంగ్రెస్ రెండో జాబితాపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఏ క్షణంలోనైనా వెల్లడయ్యే అవకాశం ఉందనే ప్రచారం జరగడంతో ఎవరికి టికెట్ వరిస్తుందోనని సర్వత్రా ఆసక్తి నెలకొంది. శనివారం కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఢిల్లీలో భేటీ కావడం.. అభ్యర్థుల ఎంపికలో వడపోత ప్రక్రియను చేపట్టడం వంటి పరిణామాలు ఉత్కంఠకు దారితీస్తున్నాయి. టికెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న ఆశావహుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆ పార్టీ అధిష్టానం ఇప్పటికే తొలి జాబితా వెల్లడించడం.. ఇందులో ఉమ్మడి జిల్లా నుంచి కేవలం మూడు స్థానాలకు మాత్రమే టికెట్లు ప్రకటించింది. మిగితా ఏడు స్థానాలను పెండింగ్‌లో పెట్టింది. తాజాగా రెండో జాబితాపై కసరత్తులు చేస్తున్న ఆ పార్టీ అధిష్టానం ఎన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తుందోననే ఆశావహులతో పాటు ఆ పార్టీ శ్రేణుల్లోనూ ఆతృత నెలకొంది. కాగా ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో కొందరు ఆశావహులు ప్రచార రథాలను సిద్ధం చేసుకొని ప్రచారం ప్రారంభించడం ఆసక్తి రేపుతోంది. ఎవరికి వారు జనాల్లోకి వెళ్లి తమకే టికెట్ వస్తుందని తామే బరిలో ఉంటామని చెబుతున్నారు.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సార్వత్రిక ఎన్నికల సమరం పతాక స్థాయికి చేరుకుంటోంది. పోలింగ్ సమయం దగ్గరపడుతున్న కొద్దీ అభ్యర్థులు టెన్షన్ వాతావరణం పెరిగిపోతోంది. రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ పార్టీ ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో పది స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడంతో వారు ప్రచార పర్వంలో నిమగ్నమయ్యారు. పల్లెలు, పట్టణాల్లోకి వెళ్లి ప్రజలను కలుస్తూ మరోసారి ఆదరించాలని కోరుతున్నారు. ఇక ప్రధాన ప్రతిపక్షంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ సైతం అదే దూకుడు ప్రదర్శించాలని భావిస్తోంది. ఇప్పటికే వారం రోజుల క్రితం తొలి జాబితాలో మూడు చోట్ల టికెట్లు కేటాయించింది. మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, బెల్లంపల్లిలో మాజీ మంత్రి గడ్డం వినోద్, నిర్మల్‌లో శ్రీహరిరావుకు టికెట్లు కేటాయించింది. మిగితా ఏడు స్థానాల్లో పెండింగ్‌లో పెట్టింది. తాజాగా వీటికి కూడా అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయించింది. ఢిల్లీలో సమావేశమైన స్క్రీనింగ్ కమిటీ అభ్యర్థులను ఎంపిక చేసే ప్రక్రియను చేపడుతోంది. ఏడు స్థానాల్లో ఎవరికి టికెట్ వస్తుందోనని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అందరిలో ఉత్కంఠకు దారితీస్తోంది. ఆదివారం ఉదయం వరకు అభ్యర్థుల పేర్లు వెల్లడయ్యే అవకాశం ఉందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ..!

కాంగ్రెస్ టికెట్లు ఆశిస్తున్న వారిలో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఇప్పటికే ఆయా నియోజకవర్గాల్లో ఆశావహులు ముమ్మర ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్ సంజీవరెడ్డి, మరో నేత కంది శ్రీనివాస్‌రెడ్డి మధ్య టికెట్‌పై తీవ్ర పోటీ నెలకొంది. వీరిలో ఎవరికో ఒకరికి వరించనుందని ప్రచారం జరుగుతోంది. బోథ్‌లో నరేష్‌జాదవ్, ఆడె గజేందర్, వన్నెల అశోక్ మధ్య టికెట్‌పై పోటీ నెలకొనగా.. ఆదివారం ఇదే నియోజకవర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు కూడా కాంగ్రెస్‌లో చేరుతున్నారు. దీంతో ఇక్కడ టికెట్ ఎవరిని వరిస్తుందోనని ఉత్కంఠకు దారితీస్తోంది. ఖానాపూర్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు, ఉట్నూర్ జడ్పీటీసీ చారులత రాథోడ్‌తో పాటు పలువురు టికెట్‌ను ఆశిస్తుండగా.. ఇదే సమయంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్‌లో చేరడంతో టికెట్‌పై ఆసక్తి నెలకొంది. ముధోల్ నియోజకవర్గంలో కొర్మెవార్ కిరణ్‌కుమార్, మాజీ జడ్పీటీసీ విజయ్‌కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఆనంద్‌రావుపటేల్ టికెట్ కోసం పోటీపడుతుండగా.. ఇటీవలే మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడంతో ఇందులో ఎవరికి వరిస్తుందోనని ఉత్కంఠ రేకెత్తిస్తోంది. ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాజీ రవాణా అధికారి అజ్మీరా శ్యాంనాయక్, మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి, డా.గణేష్‌రాథోడ్‌ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. వీరిలో ఎవరికో ఒకరికి టికెట్ వరించనుందని ప్రచారం జరుగుతోంది. సిర్పూర్ నియోజకవర్గంలో రావి శ్రీనివాస్, కె.కృష్ణారెడ్డి మధ్య పోటీ నెలకొనగా.. ఇందులో ఒకరికి టికెట్ లభించనుంది. ఇక చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తులో భాగంగా ఈ స్థానాన్ని సీపీఐకి కేటాయిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఇక్కడ ఆ పార్టీ ఆదేశిస్తే నస్పూర్ ఐదో వార్డు సభ్యుడు చంద్రశేఖర్, మేకల దాసులలో ఒకరికి టికెట్ వరించనుందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ కాంగ్రెస్ కనుక పోటీ చేస్తే మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, మాజీ మంత్రి బోడ జనార్దన్, నూకల రమేష్, డా.రాజా రమేష్, రామిల్ల రాధిక మధ్య టికెట్‌పై తీవ్ర పోటీ నెలకొంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ పార్టీ పోటీ చేస్తే మాత్రం వీరిలో ఒకరికి టికెట్ ఖరారు కానుందనే ప్రచారం జరుగుతోంది. కాంగ్రెస్, కమ్యూనిస్టుల పొత్తు అంశంపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

అయోడిన్ లోపనివారణకు ప్రజల్లో అవగాహన కల్పించాలి

- జిల్లా వైద్యాధికారి తుకారాం బట్
- ఘనంగా ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మారిన జీవన శైలి నేపథ్యంలో ప్రజల్లో అయోడిన్ లోప నివారణకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా వైద్యాధికారి తుకారాం బట్ తెలిపారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవంలో భాగంగా కలెక్టరేట్ వద్ద ర్యాలీకి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అయోడిన్ లోపం వల్ల మహిళల్లో గర్భస్రావం, మృత శిశువు జననం లాంటి వాటితో పాటు అనువంశిక జనన లోపాలు, తక్కువ బరువు గల పిల్లలు జన్మించడం, మూగతనం, చెవిటితనం లాంటివి వస్తాయని అన్నారు. వీటిపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. అయోడిన్ లోపం నివారించే విధంగా ప్రజలు అయోడిన్ సమృద్ధిగా ఉన్న ఉప్పు వాడేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. వైద్యుల సలహా మేరకు అయోడిన్ నివారణ కోసం అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో అయోడిన్ లోపంపై విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. ప్రపంచంలో 30 శాతం జనాభా అయోడిన్ లోపంతో బాధపడుతున్నారని తెలిపారు. మానవులకు కావాల్సిన సూక్ష్మపోషకాలకు అయోడిన్ ఎంతో ముఖ్యమైందన్నారు. పేద ధనిక తేడా లేకుండా అయోడిన్ లోపం ఎవరికైనా రావచ్చని, ప్రతి ఒక్కరు అయోడిన్ ఉన్న ఉప్పును వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్, ఎన్సిడి పిఓ వినోద్ కుమార్, పిఓ ధర్మసింగ్, సిబ్బంది ఉత్తం రాథోడ్, ఏఎన్‌ఎం, ఆశాలు పాల్గొన్నారు.

బీఎస్పీ గూటికి బీఆర్ఎస్ సర్పంచ్, వార్డు సభ్యులు

నవతెలంగాణ-సిర్పూరు(టి)

సిర్పూర్(టి) మండలం నుండి అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇతర పార్టీలకు వలస కడుతున్నారు. ఇప్పటికే జెడ్పీటీసీ నీరటి రేఖ, ఆమె భర్త, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ నీరటి సత్యనారాయణ, పీఏసీఎస్ డైరెక్టర్ నగరాడె రాజులు బీఆర్ఎస్‌ను వీడిన విషయం తెల్సిందే. తాజాగా మండలంలోని డోర్‌పెల్లి సర్పంచ్ మంగక్కతో పాటు ఆరుగురు వార్డు సభ్యులు అధికార బీఆర్ఎస్‌ను వీడి బహుజన సమాజ్ పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నారు. ఇదివరకే వీరు బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిశారు. ఈ నెల 27న ప్రవీణ్‌కుమార్ సమక్షంలో వారు డోర్‌పెల్లి గ్రామంలో గ్రామస్తుల సమక్షంలోనే బీఎస్పీలో చేరనున్నారు. ఈ విషయమై సర్పంచ్ మంగక్కను ప్రశ్నించగా బీఆర్ఎస్‌ను వీడుతున్న మాట వాస్తవమేనని తెలిపారు. 27న బీఎస్పీలో చేరనున్నట్లు తెలిపారు.

అంతుబట్టని రేఖానాయక్ అంతరంగం..!



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. దీంతో అసలు ఆమె అంతరంగమేమిటో అంతుబట్టకుండా ఉందని స్థానికంగా చర్చ సాగుతోంది. రెండు పర్యాయాలు గెలిచిన రేఖానాయక్‌కు బీఆర్ఎస్ అధిష్టానం టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. నియోజకవర్గంలో ఆ పార్టీలో ఎదురులేని నాయకురాలిగా ఎదిగిన ఆమె మూడోసారి కూడా టికెట్ తనకే వస్తుందని భావించారు. అనూహ్యంగా కేటీఆర్ తన మిత్రునిగా చెప్పుకునే జాన్సన్ నాయక్‌ను తెరపైకి తెచ్చి ఆయనకు పార్టీ టికెట్ కేటాయించారు. రేఖానాయక్ ఈ పరిణామాన్ని ఊహించలేకపోయారు. తనకు అన్యాయం చేశారన్న భావనతో పార్టీలోనే ఉండి బీఆర్ఎస్ అధిష్టానంపై తీవ్రమైన విమర్శలు చేశారు. అవసరమైతే రెబల్‌గానైనా పోటీ చేస్తానని పలుమార్లు ప్రకటించారు. రేఖానాయక్‌కు బీఆర్ఎస్ అధిష్టానం టికెట్ నిరాకరించిన వెంటనే మరో ఆలోచన చేయకుండా ఆమె భర్త శ్యాంనాయక్ కాంగ్రెస్ కండువా వేసుకన్నారు. ఆసిఫాబాద్ సెగ్మెంట్ నుంచి టికెట్ ఆశిస్తున్నారు. రేఖానాయక్ సైతం బీఆర్ఎస్ నుంచి మారక ముందే కాంగ్రెస్ టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ప్రచారంలో ఉంది. ఆ క్రమంలోనే శుక్రవారం ఆర్మూర్‌లో జరిగిన రాహుల్ గాంధీ సభలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తులు టికెట్‌పై ఆశలు పెట్టుకోవద్దని కాంగ్రెస్ ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. రేఖానాయక్, ఆమె భర్త శ్యాంనాయక్ మధ్యన కాంగ్రెస్ ఆదిష్టానం కుదిర్చిన సయోధ్య ఏమిటో పార్టీ అభ్యర్థుల ప్రకటన వెలువడితేగాని తెలియదు.

పార్టీ టికెట్ ఎవరికో..?

కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రేఖానాయక్‌కు టికెట్ ఇస్తారన్న హామీ మేరకే ఆమె ఆ పార్టీలో చేరినట్లు ఆమె అనుచరులు పేర్కొంటున్నారు. అయితే ఖానాపూర్ టికెట్ విషయంలో వెడ్మ బొజ్జు పేరు మొదటి వరుసలో ఉండగా మరో ఐదుగురు టికెట్ కోసం పోటీలో ఉన్నారు. బొజ్జుకు దాదాపుగా టికెట్ ఖరారు అయినట్లుగానే తెలుస్తోంది. ఇప్పుడు ఎమ్మెల్యే రేఖానాయక్ ఆ పార్టీలో చేరడంతో బొజ్జు అనుచరుల్లో అయోమయం నెలకొంది. ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉండాలన్న ఆలోచన తప్పితే మరో ఆలోచన లేని రేఖానాయక్‌కు కాంగ్రెస్ అధిష్ఠానం ఏ హామీ ఇచ్చిందోనన్న చర్చ సాగుతోంది. వెడ్మ బొజ్జును కాదని ఆధిష్టానం ఆమెకు టికెట్ కేటాయించడం అనుమానమే అంటున్నారు. మొదటి నుంచి పార్టీ వెన్నంటి ఉన్న బొజ్జును కాదని రేఖానాయక్‌కు టికెట్ కేటాయిస్తే ఆయన వెంట ఉన్న అనుచర గణం పార్టీ ఆధిష్ఠానంపై ధిక్కార స్వరం వినిపించనున్నట్లు సమాచారం. ఏం జరుగుతుందో చూడాలి మరి.

30 నుంచి పత్తి కొనుగోళ్లు

- కలెక్టర్‌రాహుల్‌రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పత్తి కొనుగోళ్లను ఈనెల 30 నుంచి ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పత్తి కొనుగోళ్ల ప్రారంభంపై అధికారులు, ట్రేడర్లు, లారీ యూనియన్ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పండించిన పత్తి పంటకు కనీస మద్దతు ధర కల్పించి పత్తి కొనుగోళ్లను చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 30న కొనుగోళ్ల ప్రారంభం దృష్ట్యా మార్కెట్ యార్డులో తూకం మిషన్‌లను, తేమ కొలిచే యంత్రాలు తదితర ఏర్పాట్లను పూర్తిచేయాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. ట్రేడర్లు, లారీ యూనియన్, రైతు సంఘాల నాయకుల సమస్యలు, సూచనలను పరిగణలోకి తీసుకొని కొనుగోళ్లను చేపడుతామన్నారు. లారీ యూనియన్ ప్రతినిధులు, ట్రేడర్లు వారి సలహాలు, సూచనలు సమావేశంలో వివరించారు. సమావేశంలో జిల్లా మార్కెటింగ్ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్య, సీసీఐ, ఇతర శాఖల అధికారులు, ట్రేడర్లు, లారీ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీఎం సొసైటీ డబ్బులు కార్మికులకు చెల్లించాలి

- ఎస్పీఎం వెల్ఫేర్ నెగోషియేషన్ కమిటీ డిమాండ్



నవతెలంగాణ-కాగజ్‌నగర్

ఎస్పీఎం ఎంప్లాయిస్ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ డబ్బులను కార్మికులకు చెల్లించాలని ఎస్పీఎం వెల్ఫేర్ నెగోషియేషన్ కమిటీ కన్వీనర్ డి సూర్యప్రకాష్‌రావు, కో కన్వీనర్ సి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం సహాయ సహకార అధికారి వెంకటేశ్వర్లుకు వారు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిల్లు మూతపడక ముందున్న యాజమాన్యం ఈ సొసైటీని ఏర్పాటు చేసిందని, కార్మికులు విడతల వారీగా సభ్యత్వాన్ని స్వీకరించి షేర్ హోల్డర్స్‌గా కొనసాగారని తెలిపారు. లాభాలను డివిడెండ్ రూపంలో కార్మికులు తీసుకునే వారని తెలిపారు. అప్పటి యాజమాన్యం కూడా పారదర్శకంగా వ్యవహరించేదని తెలిపారు. కంపెనీ మూతపడే 2014 నాటికి సుమారు రూ.10 కోట్ల మూలధనం ఉండేదని, 2018లో కంపెనీని పున:ప్రారంభించిన తర్వాత ఈ సొసైటీని పునరుద్ధరించలేదని తెలిపారు. కాని సొసైటీకి బకాయిలు ఉన్న కార్మికులు చనిపోయినా, రిటైర్ అయినా, రిజైన్ చేసినా ఇప్పటి యాజమాన్యం ఆ మొత్తాన్ని రికవరీ చేసుకుంటుందని, కార్మికులకు చెల్లించాల్సిన దానిని మాత్రం మా వద్ద రికార్డ్స్ లేవని కుంటిసాకులు చెపుతూ తప్పించుకుంటూ కార్మికులను మోసం చేస్తోందని తెలిపారు. అధికారపార్టీ నాయకులు, యాజమాన్యం కలిసి కార్మికులకు ద్రోహం చేస్తున్నారని వారు ఆరోపించారు. అధికార పార్టీ నాయకులకు ఈ విషయంలో సంబంధం లేకపోతే కార్మికుల పక్షాన ఉండి కార్మికులకు రావాల్సిన డబ్బును వడ్డీతో సహా చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎం నెగోషియేషన్ కమిటీ సభ్యులు నరహరిస్వామి, డి శంకరయ్య, సునీల్‌సింగ్, బావండ్లపల్లి వేణు, కొలిపాక రాంచందర్, జాన్‌ప్రకాష్‌రావు, నాడెం రవి పాల్గొన్నారు.

ఇక జోగు రామన్న ఖేల్ ఖతం : కంది



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎమ్మెల్యే జోగు రామన్న ఖేల్ ఖతమైందని, పదవీలో నుండి దిగిపోవడానికి ఆయనకు రోజులు దగ్గరపడ్డాయని కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. 15 యేండ్లు ఆయన ప్రజలకు చేసిందేమీలేదని విమర్శించారు. శనివారం పట్టణంలోని సుందరయ్యనగర్, ఖుర్షిద్‌నగర్ వార్డుల్లో విస్తృతంగా పర్యటించి కాంగ్రెస్ ఆరు గ్యారంటీ హామీలపై ప్రచారం చేశారు. ఇన్నేండ్లలో జోగు రామన్న ఒక్క పేదవానికి కూడా ఇంటిజాగాకానీ, ఇల్లుకానీ ఇవ్వలేదన్నారు. అర్హులైవారికి కొత్త పింఛన్లు రాలేదని, రేషన్ కార్డులు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరి సంక్షేమాన్ని విస్మరించిన జోగు రామన్నకు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. మళ్లీ మద్యం, మాంసం డబ్బులు పంపించి ఓట్లు కొనాలని చూస్తున్నాడని, ఇచ్చే పైసలు తీసుకుని ఓటు మాత్రం చేతి గుర్తుకే వేయాలని, కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జోగు రామన్నకు, పాయల శంకర్‌కు చెంప చెల్లుమనేలా ప్రజాతీర్పు ఉండాలన్నారు. డిసెంబర్ 3న ఆదిలాబాద్‌కు పట్టిన శనిని వదలగొట్టాలని పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి



భీమిని : మండలంలోని చిన్నగుడిపేట గ్రామానికి చెందిన నరిగే పోషక్క(65) పెరట్లో శనివారం ఉదయం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. దొండకాయలు తెంపుతున్న క్రమంలో ఇంటి నుండి పెరట్లో గల మోటార్‌కు వెళ్లే కట్ అయి ఉన్న సర్వీస్ వైరు చేయికి తగిలి షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయింది. మృతురాలి భర్త భీరయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎం.ప్రశాంత్ తెలిపారు.

ఐకేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఐకేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో దుర్గామాత అమ్మవారి మండపాన్ని అల్లోల దివ్యారెడ్డి సందర్శించారు. ఐకేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేసి వారితో కలిసి భోజనాలు చేశారు. స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, కన్వీనర్ కృష్ణారెడ్డి, ఇన్‌చార్జ్ సురేందర్‌రెడ్డి, సర్పంచ్ రాజేందర్, ఎంపీటీసీ గోవర్ధన్, నాయకులు రాజేంద్రప్రసాద్, గంగారాం, జహీర్ ఉన్నారు.



దుర్గామాత మండపంలో అన్నదానం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని ఖంపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మాదాపూర్ గ్రామంలో శనివారం దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా దుర్గామాత మండపంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నా బావుసాఠే జిల్లా అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, దళిత హక్కుల సాధన సమితి జిల్లా నాయకులు జాదవ్ శేఖర్ ప్రత్యేకపూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి మార్గంతో మానసిక ప్రశాంతతతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఉన్నత విద్య చదువుకొని లక్ష్యాన్ని సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మారుతి, బాబు, అవినాష్, సంజీవ్ పాల్గొన్నారు.



పోలీసు అమరుల త్యాగం మరువలేనిది

● జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్



పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కాగడను వెలిగిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-నిర్మల్

పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీతో కలిసి అమరవీరుల స్మారకార్థం కాగడాను వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ప్రజావసరాల కోసం, సంరక్షణ కోసం ఏర్పడ్డ వ్యవస్థ పోలీస్ వ్యవస్థ అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు దేశ అంతర్గత భద్రత ప్రజల రక్షణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ ఇలా ప్రతి సందర్భాల్లోనూ పోలీస్ వ్యవస్థ చాలా కీలకంగా పని చేస్తుందన్నారు. శాంతి భద్రతలు సక్రమంగా ఉంటే మారుమూల గ్రామాలకు కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. దేశ సరిహద్దు భద్రతలో సైనికుడు ఎంత కీలకమో, రాష్ట్ర భద్రతలో పోలీసు కూడా అంతే కీలకమని అన్నారు. ఎస్పీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ అక్టోబర్-21 ప్రాముఖ్యతను వివరిస్తూ, 1959 చైనా దురాక్రమణను భారత సైన్యం సమర్థంగా తిప్పిగొట్టిన రోజు ఇదేనని గుర్తు చేశారు. ఈ సమరంలో కొంత మంది పోలీసులు అమరులయ్యారని విచారణ వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ యోధుల త్యాగాలను స్మరించుకుందామన్నారు. 1959 అక్టోబర్ 21న లడఖ్ సరిహద్దులో కాపలాగా ఉన్న పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు చైనా సైన్యంతో వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించారన్నారు. ఇలా ఎన్నో వారి స్మృతి చిహ్నంగా జరుపుకుంటున్నదే అమరవీరుల దినోత్సవం అన్నారు. వీరమరణం పొందిన త్యాగమూర్తుల కుటుంబాల సంక్షేమాన్ని, వారికి ఆర్థిక పరమైన ప్రయోజనాలను సర్వస్వం లభింపచేయడం, అయా కుటుంబాలకు మానసిక బలాన్ని అందించటమే పోలీసు అమర వీరులకు మనం అందించే నిజమైన నివాళి అన్నారు. పోలీసు విధి నిర్వహణ చాలా శ్రమతో కూడుకున్నదని, ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు మాత్రమే పరిమితమయింది కాదన్నారు. ఇరవై నాలుగు గంటల ఉద్యోగం ఒక పోలీసు ఉద్యోగమని అన్నారు, పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమన్నారు. ప్రతి ఒక్కరూ ఏ ఆపదకైనా ఆశ్రయించేది పోలీసులనే, ప్రభుత్వం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది పోలీసేనని, అన్ని పరిస్థితుల్లో, అన్ని వేళల్లో పోలీసులే ముందుంటారని అన్నారు. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడే వారు సైనిక జవానులైతే, అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను సంరక్షించేది పోలీసులన్నారు. శాంతిభద్రతలను అదుపులో పెట్టడం, నేరగాళ్లను నియంత్రించడం పోలీసు కర్తవ్యమని తెలిపారు. అంతర్గత భద్రతను కాపాడే పనిలో పోలీసులు ప్రాణాలు సైతం అర్పిస్తున్నారన్నారు. అనంతరం పోలీసు త్యాగమూర్తుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, సమస్యలను అడిగి వారు చెప్పిన సమస్యలను సాధ్యమైనంత తొందరగా పరిష్కరిస్తామని ధీమా వ్యక్తం చేశారు. అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందించారు. పోలీసు వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ అమరవీరులకు రెండు నిమిషాలు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సంవత్సరం అమరులైన వారి పేర్లను రోల్ ఆఫ్ హానర్‌ను అదనపు ఎస్పీ వీరన్న చదివారు.

రక్తదాన శిబిరం...

అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా రక్తదానం శిబిరం నిర్వహించినారు. ఈ శిబిరంలో పోలీసు అధికారులు, సిబ్బంది యువత 54 యూనిట్ల రక్తదానం చేశారు. పోలీస్ అమరవీరులను స్మరించుకుంటూ పోలీస్ ఉన్నతాధికారులు, పోలీస్ సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వీరన్న, వెంకటేశ్వర్లు, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి, డీఆర్పీ, డీఎస్పీ రవీందర్‌రెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సీఐలు, ఆర్‌ఐలు, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎండీ సలీం పార్థివదేహానికి నివాళు లర్పించిన ఎస్పీ...

నిర్మల్ సాయుధ దళ కార్యాలయంలో ఎఆర్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎండీ సలీం శనివారం ఉదయం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ పట్టణంలోని వారి స్వగృహాని వెళ్లి పార్థివదేహానికి పూలమాలతో నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలు నిమిత్తం రూ.20వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ విధుల పట్ల మంచి పేరు పొందారని, వారి కుటుంబానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ప్రభుత్వపరంగా అందాల్సిన ఇతర బెనిఫిట్లను తక్షణమే అందజేసే విధంగా చూస్తామని బాధిత కుటుంబానికి భరోసానిచ్చారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు వీరన్న, వెంకటేశ్వర్లు, భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఐపీఎస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎంటీఓ వినోద్, ఎస్సైలు, పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరసత్ అలీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



పోలీసుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదానం చేస్తున్న పోలీసు అధికారులు

బుద్ధుని బోధనలే ఉన్నతమైన జీవనానికి మార్గం



నవతెలంగాణ-భైంసా

ప్రపంచానికి శాంతి, నీతి, నిజాయితీ, కరుణ, అహింసాయుత మార్గం చూపిన బుద్ధుని బోధనలే ఉన్నతమైన జీవనానికి మార్గం చూపుతాయని ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా భైంసా అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే అన్నారు. భైంసాలోని రాహుల్ నగర్ మైత్రేయ బుద్ధవిహార్ శనివారం బీఎస్ఐ భైంసా శాఖ ఆధ్వర్యంలో వర్షావాస్ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌతమ బుద్ధుని, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి దీప ధూప పూజలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గౌతమ బుద్ధుని, మహాత్మ పూలే, సాహూ, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ అడుగుజాడల్లో నడవాలని అన్నారు. సమాజంలో మైత్రి భావాన్ని పెంపొందించాలని సూచించారు. డా. బీఆర్ అంబేద్కర్ రచించిన ది బుద్ధా అండ్ హిజ్ దమ్మ అనే గ్రంథం ముగింపు కార్యక్రమంలో బీఎస్ఐ భైంసా అధ్యక్షులు ప్రసంజీత్ హేమ్లే, ఏక్‌నాథ్ బిరదే, కె.దిగంబర్, దీపక్ సూర్యవంశీ, రాహుల్ జోందలే, గణేష్ హేమ్లె, శిల్పకర్ యూత్, మాజీ శ్రామినర్, బౌద్ధ ఉపాసిక, ఉపాసకులు బౌద్ధాచార్యులు, కేంద్రీయ శిక్షకులు, బౌద్ధదమ్మ అభిమానులు పాల్గొన్నారు.

డయాలసిస్ మిషన్లు ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పేదలకు అన్ని రకాల వైద్యం అందించాలని నాడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రిమ్స్‌లో రోజు రోజుకు సౌకర్యాలు కరువవుతున్నాయని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి అన్నారు. శనివారం రిమ్స్‌లో డయాలసిస్ విభాగంలో మిషన్లు కొరత రోగులను అవస్థలకు గురిచేస్తుందన్నారు. రాత్రి సమయంలో డయాలసిస్ కోసం వచ్చిన రోగులు కింద పడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయమై శనివారం రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జై సింగ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. డయాలసిస్ విభాగంలో మిషన్లు కొరత ఉండటంతో రోగులు వేలకు వేలు పెట్టి ప్రయివేట్ ఆస్పత్రుల్లో డయాలసిస్ చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఇందులో నిరుపేద ప్రజలు, ఆదివాసులు ఎక్కువగా ఉండటంతో కాయ కష్టం చేసుకునే వీరు డయాలసిస్ కోసం వేల రూపాయలు ఖర్చుపెట్టి నష్టపోతున్నారని అన్నారు. ఇలాంటి వాటిని దృష్టిలో ఉంచుకొని రిమ్స్‌లో మిషన్ల కొరత లేకుండా చూడటంతో పాటు వారి వెంట వచ్చిన వారు రాత్రి సమయంలో సుదూర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉన్నందున సరిపడా బెడ్లను కూడా ఏర్పాటు చేయాలని కోరారు. రిమ్స్ డైరెక్టర్‌ను కలిసిన వారిలో బేల మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు మడవి చంద్రకాంత్, భోక్రే శంకర్, సందీప్, మారుతి, రాజు ఉన్నారు.

జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలి

● సీఐటీయూలో చేరిన పేషెంట్ కేర్, సెక్యూరిటీగార్డులు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జీఓ నెం.60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శనివారం నార్నూరు ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీగార్డులు జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చేరికలు కార్యక్రమంలో సీఐటీయూ సంఘంలో చేరారు. వారికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సంఘం కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని అన్నారు. అదేవిధంగా జీఓ నెంబర్ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న జీఓ నెంబర్ 60ని కాంట్రాక్టర్లు అమలు చేయకుండా కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని అన్నారు. జీఓ నెం 60 ప్రకారం రూ.15వేల 600 వేతనం చెల్లించాల్సి ఉండగా, రూ.11వేలు మాత్రమే ఖాతాలో జమ చేస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారన్నారు. పీఎఫ్ ఖాతాల వివరాలు కూడా ఇవ్వడం లేదన్నారు. ప్రతినెలా వేతనాలు చెల్లించకుండా ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తున్నారని పండగ పూట కూడా పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో నాయకులు పాపయ్య, ప్రేమ్‌దాస్, శివ, సంతోష్, సుమిత్ర, జమున, అనసూయ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటేస్తే మళ్లీ ఐదేండ్లు కష్టాలు తప్పవు

● కంది శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో పలువురి చేరికలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జోగు రామన్నకు ఓటు వేస్తే మళ్లీ ఐదేండ్లు కష్టాలు తప్పని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ప్రజా సేవా భవన్‌లో పట్టణంలోని పలు కాలనీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేశారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు ఇంటి జాగాలతో పాటు ఇల్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఆర్థికసాయం అందజేస్తామని అన్నారు. ఎన్నికలకు 40 రోజులు మాత్రమే ఉన్నాయని, ఎమ్మెల్యే జోగు రామన్నకు ఓటువేస్తే మళ్లీ ఐదేండ్లు కష్టాలు తప్పవని అన్నారు. చేతి గుర్తుకే తమ అమూల్యమైన ఓటువేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి జోగు రామన్న భయపెట్టాలని చూస్తున్నాడని మండిపడ్డారు. కార్యకర్తలకు తాను అండగా ఉంటానని, వారిని కంటికి రెప్పలా కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. జోగు రామన్న, పాయల శంకర్ ఇద్దరు ఒక్కటేనని అన్నారు. వారిని నమ్మి మోసపోవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చాయని గుర్తు చేశారు. మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ జెండా ఎగరబోతోందని, ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను పక్కాగా అమలు చేసి తీరుతామని చెప్పారు. అవ్వ తాతలకు రూ.4 వేల పింఛన్, మహిళకు నెలకు రూ.2వేల 500 ఇస్తామని తెలిపారు. అలాగే ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామన్నారు. నవంబర్ 30న అందరూ చేతి గుర్తుకే ఓటు వేసి కాంగ్రెస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ సెడ్మకి ఆనంద్‌రావు, కాంగ్రెస్ నాయకులు ఐనేని సంతోష్‌రావు, సుజాత్ అలీ, ఎంఏ షకీల్, కొండూరి రవి, రాజా లింగన్న ఉన్నారు.

అక్రమ కేసులతో కార్యకర్తలను భయపెట్టాలని చూడొద్దు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించి వారిని భయపెట్టాలనుకుంటే అది సాధ్యం కాదని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహిపాల్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. శనివారం జిల్లా జైలులో ఉన్న మహిపాల్‌ను కలువడానికి వెళ్లారు. తమకు రోజురోజుకూ జనాదారణ పెరుగుతున్న క్రమంలో జోగు రామన్నకు ఓటమి భయం పట్టుకుందని అన్నారు. అందుకే కాంగ్రెస్ కార్యకర్తల మనోధైర్యాన్ని దెబ్బతీసేందుకే అక్రమ కేసులతో వేధిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని ప్రతీ కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకునేందుకు తానున్నానని భరోసా కల్పించారు. బీఆర్ఎస్ పార్టీకి కొంతమంది పోలీసులు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, అలాంటి వారందరిపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ఆయన వెంట జిల్లా కాంగ్రెస్ ఎస్టీసెల్ చైర్మన్ షెడ్మకి ఆనంద్‌రావు, నాయకులు ఐనేని సంతోష్‌రావు, సుజాత్ అలీ, ఎంఏ.షకీల్, కొండూరి రవి, రాజా లింగన్న, చాంద్ పాషా, జంగిలి ప్రవీణ్, గంగారాం, అంజద్ ఖాన్, అస్ఫాత్ ఖాన్ ఉన్నారు.

ఘనంగా మాజీ ఎంపీ నగేష్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-ఇచ్చోడ

మాజీ ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుబార్‌పేట్ సర్పంచ్ చహకటి అభిమాన్, గ్రామస్తులతో కలిసి నగేష్‌ను శాలువాతో సన్మానించారు, పులా బొకే అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుబార్‌పేట్ సర్పంచ్ చహకటి అభిమాన్, వీటీడీఏ డైరెక్టర్ సలాంరావు పటేల్, ప్రముఖ ఆదివాసీ కళాకారుడు కాత్లె శ్రీధర్, గ్రామస్తులు ఆనంద్, రవి పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : మండలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి గోడం నగేష్ జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. కేక్ కట్ చేసి శాలువాతో సన్మానించారు. ఇలాంటి పుట్టిన రోజులు మరిన్ని నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు డోంగ్రె మారుతీ జిల్లా కోఆప్షన్ సభ్యులు అంజాద్, మండల కోఆప్షన్ సభ్యులు మీర్జా బేగ్ జిలాని, ఇంద్రవెల్లి సర్పంచ్ కోరెంగా గాంధారి సుంకట్‌రావ్, ఎంపీటీసీ రాజేశ్వర్, ఏమయికుంట సర్పంచ్ లఖన్, నాగోబా చైర్మెన్ మెస్రం తుకారాం, మండల కోఆర్డినేటర్ సుఫియాన్, శ్రీనివాస్ జనరల్ సెక్రటరీ కనక హన్మంత్‌రావ్, రైతు సమన్వయ కమిటీ తొడసం హరిదాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



నవతెలంగాణ-నిర్మల్

ఎన్నికల నిర్వహణపై సెక్టార్ అధికారులకు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీలకు మాస్టర్ ట్రైనీలకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి, అధికారులకు కేటాయించిన విధులపై దిశానిర్దేశం చేశారు. అనంతరం సీయూ, బీయూ, వీవీప్యాట్‌ల పనితీరు గురించి అధికారులకు అవగాహన కల్పించారు. ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్గి ఉండాలని, పోలింగ్ స్టేషన్‌లోకి ఫోన్‌లు అనుమతి లేదని, ఈవీఎంలను సిద్ధం చేయడం, పోలింగ్ నిర్వహణ, రవాణా, మాక్ పోలింగ్, రూట్ ఆఫీసర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోస్టల్ బ్యాలెట్‌ల నిర్వహణ ఎలా చేయాలో డెమో రూపంలో చూపించారు. ఎన్నికలలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులది కీలకపాత్రని అన్నారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ రోజు చాలా ముఖ్యమైనదని తెలిపారు. పోలింగ్ సందర్భంగా చేయాల్సిన అన్ని అంశాలపై ఎన్నికల సంఘం రూపొందించిన హ్యాండ్ బుక్‌ను ప్రతి ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారులు తూచ తప్పకుండా చదవడమే కాకుండా, అందులోని అన్ని నియమాలను పాటించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘం జారీ చేస్తున్న నిబంధనలు ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని అన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. పోలింగ్ సందర్భంగా చేయాల్సిన విధులు, చేయకూడని వాటిపై ప్రతి ఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. శిక్షణ పొందిన రోజు నుండి పోలింగ్ ముగిసే వరకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తల పట్ల ప్రిసైడింగ్ అధికారులుగా విధులు నిర్వహించే వారికి అన్ని అంశాల పట్ల పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. పోలింగ్ రోజు, పోలింగ్ ముందు రోజు చేయాల్సిన పనులను చెక్ లిస్ట్ తయారు చేసుకుని, దాని ప్రకారం విధులు నిర్వహించాలని, ప్రతి పనిపై శ్రద్ధ వహించాలన్నారు. ముఖ్యంగా పోలింగ్ సందర్భంగా ప్రతి పీఓ తీసుకోవాల్సిన మెటీరియల్, ఈవీఎంల నిర్వహణ, ఓటరు జాబితా మార్క్యుడ్ కాపీ, పీఓ, ఏపీఓ డైరీ, వారి విధులు, పోలింగ్ కేంద్రం బయట ప్రదర్శించాల్సిన సామాగ్రి, పోలింగ్ కేంద్రంలోకి అనుమతించే వారు, మాక్ పోల్, ఈవీఎం, వీవీప్యాట్‌లను ఎలా అనుసంధానం చేయాలి వంటి అన్ని విషయాలు ఒకటికి రెండుసార్లు చదువుకోవాలని చెప్పారు. మరోసారి మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఇవ్వాలని ఆయన ట్రైనింగ్ నోడల్ అధికారి, డీఈఓ రవీందర్‌ను ఆదేశించారు. పోలింగ్ రోజున ప్రతి రెండు గంటలకు ఒకసారి ఇచ్చే పోలింగ్ పర్సంటేజ్ పూర్తి జాగ్రత్తగా వివరాలు సమర్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభమైన గంగనీళ్ల జాతర

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని ప్రసిద్ధిగాంచిన అడెల్లి మహా పోచమ్మ గంగనీళ్ల జాతర శనివారం ప్రారంభమైంది. ఆలయం నుంచి ఆభరణాలను సేవాదారులు భక్తులు కాలినడకన బాజాభజంత్రీలతో పోలీసులు బందోబస్తు నడుమ న్యూసాంగ్వి గ్రామానికి బయలుదేరారు. ముందుగా ఆలయంలో ఆలయ నిర్వాహకులు రంగు రవికిషన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి చైర్మెన్ చందు, ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మాజీ చైర్మెన్‌లు మాధవ్‌రావు, ఉట్ల రాజేశ్వర్, ఏఎంసీ చైర్‌పర్సన్ ఆశ్రిత శ్రీనివాస్‌రెడ్డి, మాజీ చైర్మెన్ రాజ్ మహమ్మద్, గ్రామసర్పంచ్‌లు సుచరిత రాజేశ్వర్‌రావు, సుజాత నర్సారెడ్డి, అమ్మ వారి భక్తులు పాల్గొన్నారు.

పోలీసుల వసతి భవనం పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాల భవనాన్ని జిల్లా ఎస్పీ ప్రవీణ్ కుమార్ శనివారం పరిశీలించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక పోలీసు బలగాలు నివాసం ఉండేందుకు ఏర్పాటు చేసిన గిరిజన గురుకులంలో అన్ని వసతులను కల్పించాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్పీ కాంతి లాల్ పాటిల్, సీఐ వినోద్ రెడ్డి, ఎస్సై సాయి కిరణ్ ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారుల దాడులు

● 10 లీటర్ల నాటుసారా స్వాధీనం, ఒకరిపై కేసు నమోదు

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని కల్వాడ, మర్రిపల్లి గ్రామాల్లో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని, 600 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ సీఐ మంగమ్మ తెలిపారు. నాటుసారా తయారుచేసి విక్రయిస్తున్న కమ్మర్‌పెల్లి గ్రామానికి చెందిన జర్పుల సరితపై కేసు నమోదుచేసినట్టు ఆమె పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా చండీహోమం

నవతెలంగాణ-దహెగాం



మండలకేంద్రంలోని శివకేశవ ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవీ వద్ద నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం నవచండీ తప్పషపి హోమం నిర్వహించారు. ఉదయం నుండే వేద పండితులు గురుమూర్తి, దత్తు శర్మ, మహేష్ శర్మ, రమేష్ శర్మ, విఘ్నేష్ శర్మ, ప్రశాంత్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు సుఖసంతోషాలతో మెలగాలని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హోమం నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన దుర్గం స్వామి(28) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలకేంద్రంలోని దుర్గం మొండయ్యకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీరిలో ఇద్దరు కుమార్తెలకు, పెద్ద కుమారుడికి వివాహాలు చేశారు. చిన్నకొడుకు స్వామి మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీలో ట్రాక్టర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇదే క్రమంలో ప్రతిరోజు మద్యం సేవించి ఇంట్లో గొడవ పడుతుండేవాడు. తనకు పెండ్లి చేయాలని ఇంటిలో గొడవ జరుగుతున్న సమయంలో కుటుంబసభ్యులు తాగుడు మానెస్తేనే నీకు పెండ్లి చేస్తామని మందలించడంతో శుక్రవారం సాయంత్రం ఇంటిలో ఎవరు లేని సమయంలో తీవ్ర మనస్తాపం గురై పురుగుల మందు తాగగా గమనించిన కుటుంబసభ్యులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ స్వామి మృతి చెందాడు. తండ్రి మొండయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్టు ఎస్సై పేర్కొన్నారు.

ఆదర్శ పాఠశాల కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

● కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న వాచ్ మెన్, కుక్, కామాటీలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌తో కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రాజన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి పనిచేస్తున్న వీరికి వేతనాలు చెల్లించకపోవడం ఏంటని ప్రశ్నించారు. వేతనాల చెల్లింపు కోసం బడ్జెట్ వచ్చినప్పటికీ ప్రత్యేక అధికారుల నిర్లక్ష్యంతో కార్మికులకు సరైన సమయంలో వేతనాలు అందడం లేదన్నారు. కార్మికులతో కలిసి తాము అధికారుల నిలదీయడంతో శనివారం సాయంత్రం వరకు ఒక నెల వేతనాలు వేస్తామని అంగీకరించినట్లు తెలిపారు. నిరసన తెలిపితే వేతనాలు వేయడం ఏంటని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్మికులకు అదనపు పనిభారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. మిగతా పెండింగ్ వేతనాలు కూడా చెల్లించకుంటే కార్మికులకు అండగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు జాడి తిరుపతి, కార్మికులు రేఖ, సులోచన, సంగీత పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు వృత్తి విద్యా శిక్షణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులో భాగంగా దసరా సెలవుల్లో పది రోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా వృత్తి విద్య శిక్షణ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు రెగ్యులర్ కోర్సులతో పాటు సమాంతరంగా వృత్తి విద్యా కోర్సులను అందిస్తున్నట్లు తెలిపారు. వృత్తి విద్యా శిక్షణలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో హెల్త్ కేర్ వృత్తి విద్యా శిక్షకులు రాజసులోచన ఆధ్వర్యంలో 13 మంది విద్యార్థులు గత వారం రోజులుగా వివిధ వైద్య మెలకువలపై శిక్షణ పొందుతుండగా, అనిమేషన్ వృత్తి విద్యా కోర్సు శిక్షకులు రాజు ఆధ్వర్యంలో స్థానిక ఫొటో స్టూడియోలో 10మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు వృత్తి విద్యా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వృత్తి విద్యా కోర్సుల ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ నర్సింగ్ సూపరింటెండెంట్ పీ.వందన, మెడికల్ సూపరింటెండెంట్ చెన్నకేశవ రావు, ఆస్పత్రి సిబ్బంది, శిక్షణ పొందుతున్న విద్యార్థులు పాల్గొన్నారు.

25న కుమురంభీం విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని దాబా గ్రామ పంచాయతీలో 25న ఉదయం 10:30 గంటలకు కుమురంభీం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ కొట్నాక సుమిత్ర జంగు, ఉప సర్పంచ్ భీంరావు తెలిపారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు సోయం బాపురావు, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ కుల సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పండగ పూట వేతనాలు చెల్లించకపోవడం దారుణం

● కలెక్టరేట్ ఎదుట హాస్టల్ వర్కర్లు ఖాళీ ప్లేట్లతో నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



కలెక్టరేట్ ఎదుట ఖాళీ ప్లేట్లతో నిరసన తెలుపుతున్న హాస్టల్ వర్కర్లు

పండగ పూట హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడం దారుణమని, వారిని పస్తులు ఉంచుతారా అని హాస్టల్ రోజువారి వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెలిశాల కృష్ణమాచారి ప్రశ్నించారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలంటూ హాస్టర్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్, జిల్లా అధ్యక్షుడు అడ శ్యామ్ రావు అధ్యక్షతన ఖాళీ ప్లేట్లతో శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా పండగ అందరి ఇండ్లలో సంతోషాన్ని నింపుతే తాము వేతనాల కోసం నిరసన తెలపాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తే అక్టోబర్ 4లోపు వేతనాలు చెల్లించేలా చూస్తానని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారిణి హామీ ఇవ్వడంతో సమ్మె తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. గతంలో ముఖ్యమంత్రి డైలీవైస్ విధానం లేకుండా అందరిని పర్మినెంట్ చేస్తానని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. వేతనాలు లేకుండా దసరా పండుగ జరుపుకునే పరిస్థితి లేదని, వెంటనే అధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసన వ్యక్తం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఎన్నికల కోడ్ ఉందని చెప్పడంతో పోలీసుల తీరుపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్య ముందు కోడ్ అడ్డురాదని తమ ఆవేదన అర్థం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు జాదవ్ రాజేందర్, డైలీవేజీ అవుట్ సోర్సింగ్ యూనియన్ ఉపాధ్యక్షుడు అరిగెల కోటయ్య, నాయకులు బాలాజీరావ్, కేశవ్, నాందేవ్, తారాబాయి, మాన్కు, బాలకిషన్, దివ్య, పుష్ప, మౌనిక, రుక్మాబాయి, బిజిలి బాయి, లక్ష్మీ పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

● ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బొర్కాడే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

త్వరలో జరగనున్న అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలు జిల్లాలో ప్రశాంతంగా పకడ్బందీగా జరిగేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోదాములో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణులతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం, వీవీ ప్యాట్ల రాండమైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంతంగా జరిపేందుకు జిల్లాలో అవసరమైన చర్యలను తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని 005-ఆసిఫాబాద్, 001-సిర్పూర్ నియోజకవర్గాలలో ఎన్నికల నిర్వహణను అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. నవంబర్ 3వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల, 10వ తేదీ నామినేషన్ సమర్పించేందుకు ఆఖరు తేది అని, 13న నామినేషన్ల పరిశీలన, 15న అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరణ, 30వ తేదీన పోలింగ్, డిసెంబర్ 3వ తేదీన కౌంటింగ్ జరుగుతాయని, ఎన్నికల నిబంధనలు డిసెంబర్ 5వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 597 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాలకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్ల పంపిణీ ప్రక్రియను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసిఫాబాద్ నియోజకవర్గానికి 380 బ్యాలెట్ యూనిట్లు, 380 కంట్రోల్ యూనిట్లు, 425 వీవీ ప్యాట్లు, సిర్పూర్ నియోజకవర్గానికి 366 బ్యాలెట్ యూనిట్లు, 366 కంట్రోల్ యూనిట్లు, 410 వీవీ ప్యాట్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ ప్రతినిధుల సమక్షంలో బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లను స్కానింగ్ చేసి పటిష్ట బందోబస్తు మధ్య తరలించడం జరుగుతుందని, స్ట్రాంగ్ రూముల వద్ద 24 గంటలు పోలీసు బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని, ప్రక్రియ మొత్తం వీడియో చిత్రీకరించడం జరుగుతుందని, ప్రతి అంశం సీసీ కెమెరా పర్యవేక్షణలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీఓ సురేష్, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



రూ.4.20 లక్షల నగదు పట్టివేత



నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఎన్నికల నిబంధనలో భాగంగా వాహనాలను తనిఖీ చేస్తుండగా రూ.4.20 లక్షల నగదును పట్టుకున్నట్టు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. శనివారం అంతరాష్ట్ర సరిహద్దులో వెంకట్‌రావ్‌పేట్ గ్రామం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఒడిస్సా నుంచి తెలంగాణలోని పెద్దపెల్లి జిల్లాకు చెందిన కుర్ర రమేష్ అనే వ్యక్తి రూ.4.20 లక్షలు తీసుకెళ్తుండగా సరైన ధృవీకరణ పత్రాలు లేనందున నగదును సీజ్ చేసినట్టు తెలిపారు. నగదును ఎన్నికల ఫ్లయింగ్‌స్క్వాడ్ సిబ్బందికి అప్పగించినట్టు ఆయన పేర్కొన్నారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి నగదే కాకుండా మద్యం, మాధకద్రవ్యాలు అక్రమంగా రవాణా చేస్తే సీజ్ చేయడం జరుగుతుందని, సరైన ధృవీకరణ పత్రాలు లేకుండా తీసుకెళ్లకూడదని సూచించారు.

బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

నవతెలంగాణ-కౌటాల



ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

మండలకేంద్రంలోని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో పెంచికల్‌పేట్ మండలంలోని మురళీగూడ గ్రామానికి చెందిన 200 మంది వరకు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అదేవిధంగా మండలంలోని కన్నెపెల్లి, గురుడుపేట, కౌటాల గ్రామాల నుంచి యువకులు భారీగా చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పథంలో ముందున్నది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, మరోసారి ఆదరిస్తే ఆదుకుంటామన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు నాయకులతో కలిసి మండలంలోని పార్డీ, సాండ్‌గాం, వీరవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కోనప్పను గెలిపించాలని ప్రచారం చేశారు. అనేక సంక్షేమ పథకాలు ప్రారంభించి అమలుచేసి అన్ని రంగాల్లో సీఎం కేసీఆర్ ముందుకెళ్లారని, మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే కొత్త నాయకులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తారని, ఎన్నికలు ముగిసిన తర్వాత వారు ఎటు పోతారో తెలియదని, అలాంటి వారిని నమ్మవద్దన్నారు. మారుమూల గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కార్యకర్తలను కోరారు.

ఆదివాసీ సేన సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని కొండాపూర్ యాపలో జిల్లా ఆదివాసీ సేన అధ్యక్షులు కోట్నాక తిరుపతి ఆధ్వర్యంలో కాసిపేట మండలంలోని ఆయా ఆదివాసీ గిరిజన గ్రామాల పటేళ్లు, రాయి సెంటర్ సర్మెడీలు, తుడుందెబ్బ, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అందరి అభిప్రాయాలను తీసుకొని జీవన స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ఆదివాసీ సేన మండల కమిటీని తీర్మాణం చేసి ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మడావి గంగారాం, మండల అధ్యక్షులుగా మడావి వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పెందూర్ శంకర్, ప్రధాన కార్యదర్శిగా గణపతి, ఉపాధ్యాక్షులుగా పెందూర్ ప్రభాకర్, సీడాం శంకర్, కోశాధికారిగా ఆత్రం సంజీవ్, సలహాదారులుగా కుంతం జనార్ధన్, వెడ్మ బాపురావ్, అర్క జైతు, కుర్సింగ ఇస్రు, మడావి ప్రభాక్రావు, పెంద్రం సింగు, ఉయిక మోతీరాంలను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-రెబ్బెన

సింగరేణి సివిల్ 11వ వేజ్‌బోర్డుకు చెందిన కాంట్రాక్టర్లు సమస్యలు పరిష్కరించాలని కొత్తగూడెంలో డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి ఏరియా జీఎం కార్యాలయంలో జీఎం సివిల్ సతీష్‌బాబుకు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ కాంట్రాక్టు మాన్యువల్ 2023లోని సవరణల గురించి జీఎంకు వినతిపత్రం ఇచ్చిన వెంటనే సానుకూలంగా స్పందించిన ఆయన మేము నిలిపిన సవరణలు చేస్తామని చెప్పారు. సవరణలు చేసేంతవరకు సింగరేణి కాంట్రాక్టర్లు సివిల్ టెండర్లు వేయవచ్చని నిర్ణయించుకోవడం జరిగింది. అతి త్వరలో యాజమాన్యం సివిల్ కాంట్రాక్టర్లతో చర్చించి మాన్యువల్‌లో ఉన్న సవరణలు చేయాలని శనివారం సివిల్ జీఎంకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో సివిల్ కాంట్రాక్టు అధ్యక్షుడు కొత్తగూడెం సాయిప్రసాద్, ఇల్లందు అధ్యక్షుడు రామకృష్ణ, జబ్బార్, మనుగూరు అధ్యక్షుడు సిద్దారెడ్డి, మురుగన్, ఆర్జీ(3) ప్రెసిడెంట్ రాంచందర్‌రావు, కోట తిరుపతి, ఆర్జీ(2) ప్రెసిడెంట్ మహేందర్‌రెడ్డి, ఆర్ మల్లయ్య, ఆర్జీ(1) వైస్ ప్రెసిడెంట్ ఎన్ సదానందం, నరేందర్, ఎస్ఆర్‌పీ ఏరియా ప్రెసిడెంట్ సంపత్‌కుమార్, రాంరెడ్డి, బెల్లంపల్లి ఏరియా(గోలేటి) ప్రెసిడెంట్ గోపిరెడ్డి, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



కాగజ్‌నగర్-పెంచికల్‌పేట్ ప్రధాన రహదారి సీతానగర్ సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ముగ్గురు యువకులు కరీంనగర్‌లోని వేర్వేరు ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. ప్రత్యేక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పెంచికల్ పేట్ వైపు నుంచి ద్విచక్రవాహనంపై ఈజ్‌గాం బ్రాంచి పోస్టుమాస్టర్(బీపీఎం) శేఖర్(30) కాగజ్‌నగర్ వైపు వస్తుండగా, ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న గువ్వలగూడకు చెందిన కె. యోగి(18) బి. రాజులు ఢీకొట్టుకున్నారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ముగ్గురు యువకులు కరీంనగర్‌లోని వేర్వేరు ప్రయివేట్ ఆస్పత్రుల్లో చికిత్సపొందుతుండగా శేఖర్, యోగిల పరిస్థితి విషమంగా ఉంది.

పోలీసుల తనిఖీలో రూ.2.51 లక్షలు పట్టివేత



నవతెలంగాణ-రెబ్బెన

సార్వత్రిక ఎన్నికల పర్యవేక్షణలో భాగంగా మండలంలోని గోలేటి సీహెచ్‌పీ వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో ముగ్గురి వద్ద సరైన ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.51 లక్షల నగదును పట్టుకొని సీజ్ చేసినట్టు సీఐ అల్లం నరేందర్, ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. సీజ్ చేసిన నగదును ఫ్లయింగ్‌స్కాడ్‌కు అప్పగించామని తెలిపారు. సరైన ఆధారాలు లేకుండా ఎక్కువ మొత్తంలో డబ్బులు తీసుకెళ్తే సీజ్ చేస్తామని తెలిపారు.

దేవి మండపాల వద్ద కొనసాగుతున్న అన్నదానాలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని దేవి మండపాల వద్ద ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. రాజీవ్‌నగర్ సంఘ సేవ యువజన సంఘం దుర్గమండలి వద్ద నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అనంతరం కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డులో గల దేవి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు రాపర్తి కార్తీక్, బంక మహేష్, రాజు, అజయ్, చిన్న, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

జోరుగా సాగిన మేకల సంత

నవతెలంగాణ-తాండూర్

మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహించే కొత్తపల్లి మేకల సంత జోరుగా సాగింది. దసరా పండుగ సందర్భంగా దుర్గామాతకు జంతు బలిలను సమర్పించే ఆనవాయితిలో భాగంగా ఇక్కడ మేకల కొనుగోలు జరుపుతారు. బెల్లంపల్లి, రెబ్బెన, గోలేటి, భీమిని, ఆసిఫాబాద్, రామకృష్ణాపూర్ పట్టణాల నుంచి ఇక్కడికి కొనుగోలుదారులు, అమ్మకందారులు వచ్చి వ్యాపార లావాదేవీలను నిర్వహిస్తుంటారు. దసరా సందర్భంగా ఒకరోజు ముందు ఇక్కడ ప్రత్యేక సంత నిర్వహిస్తారు. బెల్లంపల్లి, గోలేటి, మందమర్రి ప్రాంతాలలోని సింగరేణి కార్మికులు తాండూర్ సంతలో మేకలను కొనుగోలు చేసి దసరా సందర్భంగా దుర్గామాతకు జంతు బలి సమర్పిస్తారు. కొత్తపల్లి సంతలో మేకల వ్యాపార లావాదేవీల వల్ల గ్రామపంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతోంది. సంతలో మేకలకు వ్యాపారులకు సౌకర్యాలు చేకూర్చినట్లు పంచాయతీ సెక్రెటరీ లక్ష్మణ్ తెలిపారు.

కుర్మ సంఘం మూడు మండలాల కార్యవర్గాలు ఎన్నిక

నవతెలంగాణ-చెన్నూర్

పట్టణంలోని తాపీ మేస్త్రీ సంఘ భవనంలో కురుమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చెన్నూరు. కోటపల్లి, వేమనపల్లి మండలాల నూతన కార్యవర్గాలను శనివారం ఎన్నుకున్నారు. చెన్నూరు మండల అధ్యక్షునిగా రాతిపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శిగా రాతిపల్లి మల్లేష్, కోటపల్లి మండల అధ్యక్షునిగా కుందారపు తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా రాతిపల్లి రమేష్, వేమనపల్లి మండల అధ్యక్షుడిగా అటుకపురం సతీష్, ప్రధాన కార్యదర్శిగా ఎర్రోళ్ల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా నాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ అభివృద్ధికి పాటుపడాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంగాధర తిరుపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడు నాంపల్లి తిరుపతి, మూడు మండలాల సభ్యులు పాల్గొన్నారు.

మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయం

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలతోనే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతుందని ఆ పార్టీ జిల్లా నాయకులు కేపీ నరసింహులు అన్నారు. శనివారం మండలంలో విలేకరులతో మాట్లాడుతూ ఖానాపూర్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్ 50వేల మెజారిటీతో గెలుపొందడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కేసీఆర్ చేసిన ప్రజాసంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషిచేసి గెలుపుకు నాంది పలకాలన్నారు. మూడవసారి అధికారంలోకి బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. లేకుంటే రాష్ట్రం అంధాకారమేనన్నారు. తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమన్నారు. ప్రజలు గ్రహించి మరోసారి ఈ ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు.

పంచాయతీ పూలవనం



నవతెలంగాణ-తాండూర్

గ్రామపంచాయతీలలో రోడ్డుకిరువైపులా నాటిన మొక్కలు ఫలితాలనిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధతో ముందుచూపుతో నాటిన పైడితంగడి పూలు విరబూసి ప్రకృతికి అందాన్నిస్తున్నాయి. బాటసారులకు నీడనిస్తు బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామపంచాయతీ ప్రజలు సుదూరాలకు వెళ్లకుండా స్థానికంగానే తంగేడు పూలు లభించడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు పెద్దలు శనివారం సాయంత్రం రోడ్డు కిరువైపులా పూసిన పైడితంగడి పూలను తెంపుతూ కనిపించారు. మండలంలోని ద్వారకాపూర్ పంచాయతీలో సర్పంచ్ మాసాడి శారద పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్ ముందు చూపుతో రోడ్డు కిరువైపులా పైడితంగడు చెట్లను నాటి సంరక్షించారు. అవి నేడు పెరిగి పెద్దవై విరబూసి ప్రకృతికి అందాన్నిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు సమిష్టి కృషితో అవెన్యూ ప్లాంటేషన్లపై శ్రద్ధ వహిస్తే తెలంగాణ సాంప్రదాయ పండగ బతుకమ్మ సందర్భంగా ప్రజలకు పువ్వులు స్థానికంగా లభించడమే కాకుండా పంచాయితీలు పచ్చదనంతో ప్రకృతి అందాలతో విరాజిల్లుతున్నాయి.

ఓరియంట్ కార్మికుల బోనస్ చర్చలు సఫలం



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ యాజమాన్య ఓసీసీ గుర్తింపు యూనియన్ మధ్య కార్మికుల దసరా బోనస్‌పై జరిగిన చర్చలు సఫలమయ్యాయి. ఈ ఏడాది బోనస్‌ను పర్మినెంట్, లోడింగ్ కార్మికులకు రూ.2500 పెంచి రూ.34500 అందించేందుకు ఒప్పందం చేశారు. దీంతో పాటు కాంట్రాక్ట్ కార్మికులకు రూ. రూ.600 గిఫ్ట్ ఇవ్వడానికి యాజమాన్యం ఒప్పుకోవడంతో కనీస బోనస్ రూ.16800కు అధనంగా రూ.600 కలిపి రూ.17400 కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ అందించేందుకు ఒప్పందం జరిగింది. గతంలో రెండేళ్లకు సంబంధించి ఒప్పందం జరగనుండగా ఈ సంవత్సరం నుంచి బోనస్ ఒప్పంద కాలపరిమితిని సంవత్సరానికి కుదించారు. ఈ చర్చల్లో ఓసీసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు పూస్కూరి రామ్మోహన్‌రావు, యూనియన్, లోడింగ్ నాయకులు పాల్గొన్నారు.

2021 నుంచి ప్రమోషన్లు కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి రీజియన్‌లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లకు ఈ మధ్యకాలంలో నిర్వహించిన డీ నుంచి సీ గ్రేడ్ పరీక్షలో క్వాలీఫై అయిన అందరికి డిఫెన్సులతో సంబంధం లేకుండా ప్రమోషన్లు కల్పించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు కోరారు. ప్రమోషన్లను కల్పించిన వారికి సెప్టెంబర్ 2021 నుంచి ప్రమోషన్లు కల్పించాలని శనివారం బెల్లంపల్లి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, కుర్ర రమేష్, పైడి రాములు, బండి రమేష్, వామన్‌కుమార్, తిరుపతి పాల్గొన్నారు.

పోలీస్ సేవల ఫొటోలు, వీడియోలకు బహుమతులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

అక్టోబర్ 22 నుండి ప్రారంభించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని యువతీ యువకులు ఫొటోగ్రాఫర్లు వీడియో గ్రాఫర్ల నుంచి పోలీసులు చేసిన సేవలతో కూడిన ఫొటోలు వీడియోలకు బహుమతులు అందజేయడం జరుగుతుందని ఎస్పీ సురేష్ కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాలలో పోలీసులు చేసిన సేవ, ఇతర పోలీసుల కీర్తి ప్రతిష్టలను పెంపొందించే అంశాలపై తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో మూడు నిమిషాలకు తగ్గకుండా షార్ట్ వీడియోలను రూపొందించాలని ప్రతిభ కనబరిచిన మొదటి మూడు ఫొటోలను వీడియోలను జిల్లాలో బహుమతి ప్రధానం చేస్తూ రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని తెలిపారు. ఈ ఫొటోలను, వీడియోలను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 23వ తేది లోపు సమర్పించాలని తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా వ్యాసరచన పోటీలు రక్తదాన శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని వివరాలు వెల్లడిస్తామని యువత పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జన్నారంలో టింబర్ వేలం వాయిదా

నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లోని అటవీ డివిజన్ పరిధిలోగల టింబర్ డిపోలో 23న నిర్వహించే టింబర్ వేలంను వాయిదా వేసినట్లు జన్నారం ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టింబర్ వేలంపాటను దసరా పండగ కారణంగా వాయిదా వేశామన్నారు. తిరిగి 26న నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని గ్రహించి అటవీ శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

పండగ వేళ ఓటర్లకు ప్రలోభాల ఎర..!

- కొత్త వ్యూహాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్న పార్టీలు
- ఇప్పటికే ఓటర్లకు చెంతకు బీజేపీ క్వార్టర్ కూపన్

నవతెలంగాణ-హాజీపూర్

పండగ వేళ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పార్టీలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. మరో 40 రోజుల్లో అంటే నవంబర్ 30న పోలింగ్ జరగనుంది. ఎన్నికలు సమీపిస్తుండటంతో పార్టీ నాయకులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు చర్చలు చేస్తున్నారు. ఓటర్ల అవసరాలను తెలుసుకుంటూ వారికి కావాల్సిన వాటిని అందజేసేలా కొత్త ప్రణాళికలు రచిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చిన బతుకమ్మ దసరా పండగలు పార్టీలకు చాలా కలిసివచ్చాయి. ఇప్పటికే బతుకమ్మ పండగల సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ పూర్తి చేయగా బతుకమ్మ ఆటలు ఆడుకునేలా పరోక్షంగా ఏర్పాట్లు చేసి కోలాటాలు, డీజే సౌండ్ సిస్టమ్స్‌తో పాటు ఇతర అవసరాలను సమకూర్చారు. అలాగే యువతకు క్రీడలకు సంబంధించి వివిధ రకాల కిట్లను కూడా పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో అయితే పండగ వేళ అంటూ ఆటలు ఆడిస్తూ నగదు బహుమతులతో పాటు ఇతర ప్రోత్సాహకాలు అందజేస్తున్నారు. ఇక ఇప్పుడు దసరా పండగ అంటేనే మందు, విందుల జోరు ఉండనే ఉంటుంది. ఇదే అస్త్రంగా మలుచుకున్న అన్ని పార్టీలు ఓటర్లకు మద్యం, మటన్ పంపిణీకి శ్రీకారం చుట్టేశాయి. తాజాగా శనివారం ఇందుకు సంబంధించి ముందస్తుగా మద్యం పంపిణీకి పార్టీలు కొత్త ఎత్తుగడలతో ముందుకు వచ్చాయి. వైన్స్, ఊరు పేర్లతో కలిపి కూపన్లు తయారు చేయించారు. నియోజకవర్గంలో బీజేపీ ఒక అడుగు ముందుకు వేసి దసరా వేళ ఓటరు మద్యంతో మజా చేసుకునేలా క్వార్టర్‌కి ఒక కూపన్ చొప్పున గ్రామాల్లో ఇంటింటా పంపిణీ చేశారు. అంతేకాదు ఆదివారం కావడంతో ఉదయాన్నే మటన్, చికెన్ల కొనుగోళ్లకు కూడా ఈ టోకెన్లు ఇచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఈ టోకెన్లు నేరుగా ఓటర్లకే ఇస్తుండటంతో ఎలాంటి అనుమానాలు రాకుండా పార్టీలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ఓటరే నేరుగా వెళ్లి మద్యం, మటన్, చికెన్ తీసుకునేలా టోకెన్లు ఇవ్వడంతో పార్టీలకు సంబంధం లేదన్నట్లుగా ఈ విధానానికి తెర తీశారు. ఏదేమైనా పండగల వేళ పార్టీలు ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా అప్పుడే తమ వ్యూహాలకు పదును పెడుతున్నారు. రానున్న రోజుల్లో ఎన్నికల జిమ్మిక్కులు ఇంకా ఎలా ఉండబోతున్నాయో మరీ..!



బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

ఖాతాదారులు ప్రభుత్వం కల్పిస్తున్న బీమా సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని కుటుంబ సభ్యులకు భీమా కల్పించాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ అనిల్ దేశ్‌ముఖ్ అన్నారు. శనివారం నర్సాపూర్ గ్రామపంచాయతీలో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై అవగాహన కల్పించారు. మేనేజర్ మాట్లాడుతూ ఆర్‌బీఐ పరిధిలో లేని బోగస్ వ్యాపార సంస్థల ఆగడాలను అరికట్టడమే లక్ష్యంగా ప్రజలకు సురక్షిత బ్యాంకింగ్ పద్ధతులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. యూనియన్ బ్యాంకు ద్వారా సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ కల్పిస్తున్నట్లు చెప్పారు .యూనియన్ బ్యాంకులో వ్యవసాయ రుణాలు, బంగారు ఆభరణాలపై రుణాలు, కుటీర పారిశ్రామిక రుణాలు, స్వయం సహాయక సభ్యులకు నిబంధనల మేరకు వడ్డీ రాయితి రుణాలను అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఫర్ ఫైనాన్స్ కౌన్సిలర్స్ బి.రవి మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన కింద అప్పుడే పుట్టిన పాప దగ్గరి నుంచి 10 సంవత్సరాల లోపు ఉన్న వాళ్ళందరికీ కూడాసుకన్య సమృద్ధి యోజన వర్తిస్తుందని తెలిపారు. ఆన్‌లైన్ మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగు భాయ్, పంచాయతీ కార్యదర్శి సాదుల్లా యూనియన్ బ్యాంకు సిబ్బంది, సతీష్ కుమార్, సుందేవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ అనిల్ దేశ్‌ముఖ్

ప్రజారక్షణలో పోలీసుల పాత్ర వెలకట్టలేనిది

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్, ఎస్పీ సురేష్ కుమార్
- ఘనంగా పోలీస్ అమరవీరుల దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రజాస్వామ్యంలో ప్రజల రక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఉంటుందని ఇలాంటి విధిని నిర్వహిస్తున్న పోలీసుల పాత్ర వెలకట్టలేనిదని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ సురేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎస్పీతో కలిసి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి అమరులకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మిగతా విభాగాలతో పోలిస్తే పోలీసుల కర్తవ్యం ఎంతో గొప్పదన్నారు. అనేకమంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని వారందరినీ స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమరుల కుటుంబానికి బాసటగా నిలవాలని సూచించారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని తెలిపారు. సిర్పూర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ ప్రాంతంలో 1995 నుంచి 14 మంది పోలీసులు వాళ్ళ ప్రాణాలు సమాజం కోసం శాంతి భద్రతల కోసం త్యాగం చేశారని వారందరి సేవలు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ఉంటుందంటే పోలీసులు ప్రధాన కారణమన్నారు. పండగలకు, సెలవులకు అతీతంగా, సరదా సంబురాలకు దూరంగా ఉంటూ, సమాజ శ్రేయస్సు కోసం పరితపించేది తమ శాఖేనని చెప్పుకోవడంలో గర్వంగా ఉందన్నారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని దృష్టిలో పెట్టుకొని ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ కొనసాగుతుందన్నారు. ప్రజలు తమకు వచ్చిన కష్టాలు చెప్పుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు రావడానికి భయపడకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ప్రజలందరికీ కూడా ఇంకా ఎక్కువ సేవ చేసి మన రాష్ట్ర ప్రభుత్వానికి మన దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం అమరవీరుల కుటుంబసభ్యుల సమస్యలను తెలుసుకొని వాటిని త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేస్తామని తెలిపారు. అమరవీరుల కుటుంబ సభ్యులను శాలువాతో సన్మానించి, బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వరరావు, డీఎస్పీలు వెంకటరమణ, కరుణాకర్, రమేష్ పాల్గొన్నారు.



తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ పండుగ ప్రతీక అని కలెక్టర్ బొర్కాడే హేమంత్ సహదేవరావు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఎన్నికల స్వీప్‌లో భాగంగా జిల్లా కేంద్రంలోని మహిళా సాధికారిత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేడుకల్లో ఆయన సతీమణి రేవతి కూతురు ముక్తతో కలిసి హాజరయ్యారు. బతుకమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల సాధికారిత సాధ్యం కావాలంటే ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. ఇప్పటికే ఎన్నో రంగాల్లో మహిళలు దూసుకుపోతున్నారని, రానున్న నవంబర్ 30న ప్రతి మహిళ తన ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బతుకమ్మ పండుగ ప్రతి ఒక్కరి ఇంట్లో సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. పూలను పూజించే గొప్ప సాంస్కృతి తెలంగాణకు ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూఓ సావిత్రి, డీటీడీఓ రమాదేవి పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలో బతుకమ్మ వేడుకలు

రెబ్బెన : తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయం ఆవరణలో శనివారం మహిళా ఉద్యోగులు బతుకమ్మ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. రెండు రోజులు సెలవులు రావడంతో ముందస్తుగా కార్యాలయం ఆవరణలో జానపద గీతాలతో ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ బతుకమ్మ ఆడి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు.



ఎస్పీఎం కుటుంబాలకు పెండింగ్ మొత్తాలు చెల్లించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్పీఎంలో గతంలో పనిచేసి మరణించిన, రిటైర్డ్ అయిన కార్మికుల కుటుంబాలకు పెండింగ్ మొత్తాలను చెల్లించాలని ఎస్పీఎం సంక్షేమం సంప్రదింపుల కమిటీ ప్రతినిధులు వెంకటేష్, జాన్ ప్రకాష్‌లు డిమాండ్ చేశారు. జిల్లా సహకార కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు కార్మికులకు రావాల్సిన బకాయిలు మిల్లులోని సొసైటీ విభాగం చెల్లించడం లేదని వెంటనే చెల్లించేలా చూడాలన్నారు. కంపెనీల చట్టాన్ని తుంగలో తొక్కుతూ 2014లో కంపెనీ షడ్ డౌన్ చేశారని, 2018లో తిరిగి ప్రారంభించిన విషయం తెలిసిందేనని అన్నారు. ప్రారంభ సమయంలో కేటీఆర్ స్థానికులకు అవకాశం ఇస్తామని ప్రకటించినప్పటికీ మొత్తం కార్మికుల్లో 350 మందిని కూడా విధుల్లోకి తీసుకోలేదని ఆరోపించారు. పాత యాజమాన్యం చొరవతో 1985లో రిజిస్టర్ నెంబర్ 484 ప్రకారం ఎస్పీఎసం ఎంప్లాయిస్ క్రెడిట్ సొసైటీ ప్రారంభించడం జరిగిందన్నారు. కార్మికులు తమ డబ్బులను సొసైటీలో జమ చేయడం జరిగిందని, దానిని వివిధ బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ల రూపంలో జమ చేశారన్నారు. అయితే నూతనంగా వచ్చిన యాజమాన్యం వాటిని దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు. రిటైర్ అయిన ఉద్యోగుల నుంచి రికవరీ చేస్తుందని సొసైటీ నుంచి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా కార్మికులను ఇబ్బంది పెడుతుందని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి సొసైటీ నుంచి తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వేణు, నరహరి, స్వామి, సునీల్ సింగ్, రామచందర్, శంకరయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్‌లకు ఓటుతో బుద్ధి చెప్పాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలకు ఓటుతో బుద్ధి చెప్పాలని బీఎస్పీ ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బన్సీలాల్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని దొంగపెల్లి నగర్ గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. గిరిజనులకు విద్యా వైద్యం కనీస వసతులు సమకూర్చడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో గిరిజనులకు కనీస రోడ్డు, విద్యుత్ సౌకర్యం లేదన్నారు. బడుగు బలహీన వర్గాలు గిరిజనుల అభివృద్ధి చెందాలంటే బీఎస్పీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ బీఎస్పీకి ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మండలం అధ్యక్షులు బుక్య రమేష్ నాయక్, కన్వీనర్ కతేరపాక రవీందర్, బాణావత్ రేఖానాయక్, కళ్యాణ్, భీమన్న, వినోద్ కుమార్, అరుణ్ నాయక్, సతీష్ పాల్గొన్నారు.

దుర్గాదేవి పూజలో పాల్గొన్న జీఎం దంపతులు

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ఆర్కే ఓసీపీ గని ఆలయంలో కొలువైన దుర్గాదేవి పూజలో శనివారం మందమరి ఏరియా జీఎం ఏ మనోహర్-సవిత (సేవా అధ్యక్షురాలు) పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ లక్ష్యాలతో కూడిన ఉత్పత్తిని సాధిస్తూ ప్రగతి పథంలో నడపి సంస్థ అభివృద్ధికి కార్మికులు పాటుపడాలని కోరారు. అలాగే పట్టణ ప్రజలకు ఉద్యోగులకు సద్దుల బతుకమ్మ దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ ఏజీఎం కేహెచ్ఎన్ గుప్తా, ఆర్కే ఓసి ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, ఆర్కే ఓసి మేనేజర్ సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని మేదరిపెట్ గ్రామానికి చెందిన కర్నె శ్రీనివాస్ భార్య అనారోగ్యంతో బాధపడుతుండగా తనతో పాటు చదువుకున్న మిత్రులు అందరూ కలిసి రూ. 2,4500లను శనివారం శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం అందజేశారు. దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1984-85 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు తోటి మిత్రునికి ఆర్థిక సాయం అందజేసి స్నేహం విలువను చాటారు. స్నేహితుని కుటుంబం ఆపదలో ఉందని తెలుసుకున్న పూర్వ విద్యార్థులు అందరూ కలిసి తమకు తోచిన సహాయం అందజేసి మీకు మేమున్నాం అంటూ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు. ఆపదలో ఉన్నప్పుడు ఆదుకున్నప్పుడే నిజమైన మిత్రులు అవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అక్కల తిరుపతి, నూరా తిరుపతి, బోలిశెట్టి భూపతి, గోలి రవీందర్, బోయిడి శేషాద్రి కట్ట రాజమౌళి, బోడకొండ సుధాకర్, నర్సయ్య, అంజయ్యలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మేనిఫెస్టో చూసి ప్రజలు మోసపోవద్దు

నవతెలంగాణ-జన్నారం

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ స్కీంలను చూసి ప్రజలు మోసపోవద్దని ఎంపీపీ మాదాడి సరోజన, బీఆర్ఎస్ అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పైడిపల్లి గార్డెన్‌లో నిర్వహించిన మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. కాంగ్రెస్‌ను తెలంగాణలో గెలిపిస్తే మళ్లీ అంధకార తెలంగాణగా తయారవుతుందన్నారు. విద్యుత్తు, ఎరువులు రైతులకు సక్రమంగా దొరకవన్నారు. ప్రజలు ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి కార్యకర్త, నాయకుడు గ్రామాల్లో బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు తెలుపాలన్నారు. ఖానాపూర్ పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, జిల్లా నాయకులు భరత్ కుమార్, స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్, ఉపసర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, లెక్కల మల్లయ్య రాజు నాయక్, జక్కుల సురేష్, తాళ్లపల్లి రాజేశ్వర్, కృష్ణ, రవి రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



విద్యుద్ఘాతానికి గురై ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలోని లాండసాంగి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లాండసాంగి గ్రామానికి ముత్యపు రామన్న(36) గ్రామంలోనే స్లాబ్ వేస్తున్న సందర్భంగా రామన్న మేస్త్రి పని చేస్తుండగా శనివారం 11కెవి తగలడంతో విద్యుద్ఘాతానికి గురయ్యాడు. వెంటనే గ్రామస్తులు ఆటోల జిల్లా రిమ్స్‌కు తరలించారు. పరిశీలించిన వైద్యులు చూసేసరికి మరణించినట్లు తెలియజేశారు. మృతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నట్లు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుగుతున్నట్టు తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

నవతెలంగాణ-ముధోల్



రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని తరోడ తండ, తరోడ గ్రామంలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ అభివృద్ధి కృషి చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విఠల్‌రెడ్డిని అత్యధిక మోజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పీఏసీఎస్ చైర్మెన్ సురేందర్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, ఎంపీటీసీ బండారి గంగాధర్, మాజీ సర్పంచ్ అరిపోద్దీన్, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

శాంతి భద్రతల పరిరక్షణ, దేశ సరిహద్దు రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జిల్లాలో శనివారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నూతనంగా అమరవీరుల ముఖచిత్రాలతో ఏర్పాటు చేయబడిన స్తూపం వద్ద జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, జిల్లా అదనపు సెషన్స్ జడ్జి డా.శివరాం ప్రసాద్, జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి, జిల్లా ఫారెస్ట్ ముఖ్యఅధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్, డీటీసీ పుప్పాల శ్రీనివాస్, ఇతర పోలీసు ఉన్నతాధికారులు, పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. జిల్లా పోలీసు యంత్రాంగం పోలీసు సంస్మరణ దినోత్సవం ఫ్లాగ్‌డే సందర్భంగా భారీ ఏర్పాట్ల మధ్య ఘనంగా అమరవీరులకు నివాళులు సమర్పించారు. దేశ రక్షణలో ప్రాణం కంటే విధినిర్వహణ గొప్పదని, అమరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయమని కొనియాడారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో జిల్లా యంత్రాంగం అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొని స్థూపానికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. స్తూపం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసిన జిల్లా కలెక్టర్, అదనపు సెషన్స్ జడ్జి, జిల్లా ఎస్పీ, అధికారులు అందరితో కలిసి అమర జ్యోతిని వెలిగించారు. అనంతరం అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అమరవీరుల కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రజలు, పోలీసు అధికారులు కలిసి భారీ ఎత్తున పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు సెషన్స్ జడ్జి డాక్టర్ శివరాం ప్రసాద్, ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి లు కలిసి జెండా ఊపి ప్రారంభించారు.



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న అమరవీరుల కుటుంబ సభ్యులు



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

పోలీసుల పాత్ర మరువలేనిది : కలెక్టర్

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి అమరవీరుల కుటుంబ సభ్యులకు జిల్లా యంత్రాంగం తరపున ఎటువంటి సమస్యలను ఉన్న వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో 24 గంటలు నిరంతరం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులను నిర్వర్తిస్తున్న పోలీసుల పాత్ర మరువలేనిదన్నారు.

త్యాగమూర్తుల అడుగుజాడల్లో పయనించాలి...

ఈ సందర్భంగా జిల్లా అదనపు సెషన్స్ జడ్జి డాక్టర్.శివరాం ప్రసాద్ మాట్లాడుతూ పోలీసు అమరవీరులు తమ జీవితాలను సైతం ఫణంగా పెట్టి విధులను నిర్వర్తించడంలో ముందుండి మార్గదర్శనం చేసిన వారి అడుగుజాడల్లో పయనించాలని తెలిపారు. సభ్య సమాజం సన్మార్గం వైపు పయనించాలంటే త్యాగమూర్తుల అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. అమరవీరులను అనుదినం స్మరించుకుంటూ వారు చేసిన త్యాగాలను మరచిపోకూడదని సూచించారు. అమరవీరుల కుటుంబ సభ్యులను కూడా భాగస్వామ్యం చేస్తూ ఇంతటి ఘనకార్యాన్ని నిర్వహించిన జిల్లా పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

నాటి వారి త్యాగాలే నేడు ప్రశాంతతకు నిదర్శనం...

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఒకప్పటి పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు ప్రస్తుత జిల్లా ప్రశాంత వాతావరణ నెలకొల్పడానికి ఎంతగానో ఉపయోగపడిందని, అమరవీరులను అనునిత్యం స్మరించుకోవాలన్నారు. అక్టోబర్-21 జాతీయ పోలీస్ చరిత్రలో ఎర్రని అక్షరాలతో లిఖించబడిన రోజన్నారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు డీఎస్పీలు వి ఉమేందర్, సిహెచ్ శ్రీనివాస్, సీహెచ్ నాగేందర్, పోతారం శ్రీనివాస్, డీపీఆర్వో విష్ణు, సీఐలు కే.సత్యనారాయణ, కే.నరేష్, ఏ అశోక్, ప్రేమ్ కుమార్, సైదారావు, చంద్రశేఖర్, రామకృష్ణ, శ్రీనివాస్, ప్రణయ్‌కుమార్, సురేష్ సబ్ ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ సిబ్బంది పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీసీసీ గిన్నెల సత్యనారాయణ, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి విజయదశమి వేడుకలు విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించనున్న విజయదశమి వేడుకలకు పెద్దఎత్తున హాజరుకావాలని సమితి జిల్లా అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి కోరారు. శనివారం పట్టణంలోని రాంలీలా మైదానంలో వేడుకలకు సంబంధించిన పనులను సమితి సభ్యులతో కలిసి పరిశీలించారు. సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 11 సంవత్సరాలుగా విజయదశమి పర్వదిన వేడుకలను రాంలీలా మైదానంలో ఘనంగా జరుపుతున్నామని తెలిపారు. ప్రతియేడులాగే ఈ సంవత్సరం కూడా షమిపూజతో పాటు రావణ దహనం ఉంటుందన్నారు. ఔరంగాబాద్ నుంచి వచ్చే కళాకారులు తమ సాంస్కృతిక కళా ప్రదర్శనలతో ఆకట్టుకుంటారని తెలిపారు. పండగ ఉత్సవాలను జరిపేందుకు దాదాపు ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. హిందూ బంధువులు పెద్దఎత్తున పాల్గొని విజయదశమి వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రూ.10లక్షల నగదు పట్టివేత

నవతెలంగాణ-బేల

ఎన్నికల సందర్భంగా పోలీసులు ప్రత్యేకంగా చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అక్రమంగా మద్యం, డబ్బులు జిల్లాలో రాకుండా నిత్యం చెక్‌పోస్టుల వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు. శనివారం మండలంలోని శంకర్‌గూడ చెక్‌పోస్ట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా గడ్‌చందూర్ నుంచి నాందేడ్‌కు హరిబాబు ఎలాంటి ఆధారాలు లేకుండా డబ్బులు తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి రూ. 10లక్షలను సీజ్ చేశారు. ఎలాంటి ఆధారాలు లేని కారణంగా ఆ డబ్బులను ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించినట్టు ఎస్సై ఐ.రాధిక తెలిపారు.

టీడీపీ టికెట్ కోసం ఇద్దరు దరఖాస్తు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ టీడీపీ టికెట్టు కోసం ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి అల్లూరి రాజారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఎండీ రఫీక్ ఇద్దరు దరఖాస్తు చేసుకున్నారు. శనివారం టీడీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను కలిసి దరఖాస్తులను అందజేశారు. జిల్లాలో టీడీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తున్నామని వివరించారు.

రైతు రాజ్యమే కేసీఆర్ లక్ష్యం

నవతెలంగాణ-తలమడుగు

ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం మండలంలోని భరంపూర్ గ్రామంలో బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోథ్ ఎమ్మెల్యేగా గెలిపించినట్లయితే మరోసారి కేసీఆర్ సీఎం అయితే రైతుల రాజ్యం ఏర్పడుతుందని అన్నారు. నిరంతరం రైతులకు అండగా ఉంటారన్నారు. అత్యధిక మెజారిటీతో గెలిపించాలని భరంపూర్ గ్రామస్తులను కోరారు. అనంతరం గ్రామానికి చెందిన ఎంపీటీసీ రేణుకతో పాటు వివిధ సంఘాల నాయకులు మహిళ సభ్యులు, బీజేపీ, కాంగ్రెస్ పార్టీ నుంచి దాదాపు 300 మంది కార్యకర్తలు అనిల్ జాదవ్ సమీక్షంలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్, కేదారీశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, రమాకాంత్, గంగాధర్, ఆశన్న యాదవ్, ఆనంద్, పల్లవి, సునీతరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, అనిల్ అన్న యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో కారు జోరు

నవతెలంగాణ-కడెం

మండలంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న క్యాంప్, వకీల్‌నగర్, గోండుగూడ గ్రామాలకి చెందిన 100 యువకులకు పైగా స్వచ్ఛంధంగా ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్ నాయక్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం కేసీఆర్ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కేసీఆర్ రాష్ట్ర పాలన మరొకసారి చూడాలని కోరుకుంటున్నామని అన్నారు. కేసీఆర్‌ని హ్యాట్రిక్ సీఎంగా చేస్తే అణగారిన వర్గాలకు ఎంతోమేలు చేస్తారని కార్యకర్తలు అన్నారు. అనంతరం నవరాత్రుల సందర్భంగా మండలంలోని అంబారిపేట్ గ్రామంలోని దుర్గామాతను దర్శించుకుని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా, జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నల్ల జీవన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, అంబారిపేట్ సర్పంచ్ కొప్పుల లక్ష్మీ లచ్చన్న, ఎంపీటీసీ కట్ల సింధూజ సాగర్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు రవి, కడెం మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అడెల్లి పోచమ్మ జాతరకు సర్వం సిద్ధం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

అడెల్లి పోచమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. ఆదివారం జరిగే అడెల్లి పోచమ్మ జాతరకు దిలావర్‌పూర్ వీడీసీ సభ్యులు, పోలీసు సిబ్బంది సర్వం సిద్ధం చేశారు. శనివారం వీడీసీ సభ్యులు సమావేశం ఏర్పాటు చేసి జాతరలో చేపట్టాల్సిన ఏర్పాట్లను, పాటించాల్సిన నియమాలు గురించి చర్చించారు. జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని అన్నారు. కొబ్బరి కాయలు కొట్టి అమ్మవారికి గొడుగులా పట్టే వలపై వేయకూడదని సూచనలు చేశారు. సారంగాపూర్ మండలం అడెల్లి దేవస్థానం నుంచి పోచమ్మ ఆభరణాలతో బయలుదేరి శనివారం సాయంత్రానికి మండల కేంద్రానికి చేరుకుంది. గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు అమ్మవారని సాదరంగ సాగనంపారు. సాంగ్వి గ్రామంలోని గోదావరి నది తీరానికి చేరుకొని ఆభరణాలు శుద్ధి చేసి, గోదావరి నీళ్లతో ఆదివారం ఉదయం అక్కడి నుంచి బయలుదేరి కంజర్, బన్సపల్లి, దిలావర్‌పూర్, మాడేగాం, కదిలి, ప్యారమూర్, వంజర్, యాకర్‌పల్లి, సారంగాపూర్ గ్రామాల మీదుగా సాయంత్రానికి అడెల్లి దేవస్థానానికి చేరుకుంటుంది.

గ్రామాల్లో ముమ్మర ప్రచారం

నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ నాయకులు మమ్మురంగా ప్రచారం చేస్తున్నారు. శనివారం మండలంలోని పులిమడుగు గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు కందుకూరి రమేష్, ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జాధవ్ శ్రీరాం, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేష్ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రవేశపెట్టిన పథకాలపై వివరించారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి జాన్సన్ నాయక్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ ధవులే బాలాజీ, ఫ్యాక్స్ వైస్ చైర్మన్ నారాయణ, సోషల్ మీడియా నాయకులు బాబాశ్యామ్, గ్రామ సర్పంచ్ సరిత శ్రీనివాస్, నాయకులు ప్రదీప్ పాల్గొన్నారు.

25 నుంచి కొనుగోళ్లు ప్రారంభం

నవతెలంగాణ-బోథ్

మార్కెట్ యార్డులో ప్రభుత్వ పరంగా సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి సోయా, మొక్కజొన్న కొనుగోళ్లు ప్రారంభిస్తున్నామని సహకార సంఘం సీఈఓ గోలి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు తమ పంటలను శుభ్రపరచి ఆరబెట్టుకొని తేమ లేకుండా మార్కెట్‌కు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం సోయాకు రూ.4600, మొక్కజొన్నకు రూ.2090 మద్దతు ధర ప్రకటించినట్లు తెలిపారు.

నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు మార్గదర్శకాలను పాటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిర్వహించే తనిఖీల్లో పట్టుబడే నగదు, బంగారం సీజ్ చేసేటప్పుడు ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, రాష్ట్ర డీజీపీ అంజని కుమార్, ఇతర ఉన్నత స్థాయి అధికారులతో కలిసి ఎన్నికల నియమావళి, ఫిర్యాదులు, ఎంసీఎంసీ, నగదు, బంగారం పట్టివేత, సి-విజల్ యాప్, తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాల్లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. ఎన్నికల ప్రచారంకు సంబంధించి సమావేశాలు, సభలు నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థుల నుంచి సువిధ యాప్ ద్వారా, ఆఫ్ లైన్‌లో వచ్చే దరఖాస్తులకు ఎప్పటికప్పుడు సకాలంలో అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో జరిగే ఎన్నికల ప్రచారంలో వినియోగించే ఆడియో, వీడియోలను పరిశీలించి ఎంసీఎంసీ ధృవీకరించాలని, ప్రతి రోజూ ఎంసీఎంసీ, సువిధ యాప్, ఆఫ్‌లైన్ దరఖాస్తులపై ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని అన్నారు. ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని అన్నారు. నగదు సీజ్ చేసే సమయంలో సంబంధిత వ్యక్తులకు నగదు, బంగారం వివరాలు, ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుంది. అనే అంశాలను తెలియజేస్తూ రశీదు తప్పనిసరిగా అందించాలని అన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్ సెల్‌కు అప్పగించాలని, రూ.10 లక్షల కంటే ఎక్కువ ఉన్నట్లయితే ఐటీ అధికారులకు అప్పగించాలని అన్నారు. సదరు నగదుపై వచ్చే అప్పీల్‌లను సంబంధిత గ్రీవెన్స్ సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని అన్నారు. సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన అభరణాల గురించి, సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్ అనంతరం విడుదల చేసే నగదు వివరాలు మీడియాకు సమాచారం అందించాలని అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్సు, వీడియో సర్వేలెన్సు బృందాలతో పాటు తప్పనిసరిగా వీడియో కెమెరా సౌకర్యం ఉండాలని, ప్రతి తనిఖీ వీడియో కెమేరాలో రికార్డు చేయాలని అన్నారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ పీఎస్, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, శిక్షణ సహయ కలెక్టర్ వికాస్ మోహతో, అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్రప్రధాన ఎన్నికల అధికారి నిర్వహించిన వీసీలో పాల్గొన్న కలెక్టర్

పేదల రాజ్యం డీఎస్పీతోనే సాధ్యం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

పేదల రాజ్యం ధర్మసమాజ్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేష్ మహారాజ్ అన్నారు. శనివారం ధర్మ సమాజ్ పార్టీలో చేరిన పలువురు బీసీ, రజక, ముదిరాజ్, బీసీ జాగృత, భవన నిర్మాణ కార్మిక, మున్నూరు కాపు సంఘం నాయకులు చేరారు. ఈ సందర్భంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీలు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని వేల సంవత్సరాలుగా అణగారిన వెనుకబడిన కులాలను అగ్రకులాలు దోపిడికి గురి చేశాయని విమర్శించారు. ఇతర పార్టీలలో ఎన్ని రోజులు ఉన్న పాలకులుగా మారలేమని అలాంటి వారి కోసమే తమ పార్టీ ఆవిర్భావించిందని గుర్తు చేశారు. మంచిర్యాల జిల్లాలో దోపిడికి గురవుతున్న కులాలను చైతన్య పరుస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు. తమ పార్టీలో చేరిన మంచిర్యాల నాయకులను డీఎస్పీ కార్యవర్గ సభ్యులుగా ప్రకటిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏదునూరి రమేష్, మంచర్ల సదానందం, పెద్దపల్లి సూరయ్య, మంచిర్యాల జిల్లా సభ్యులు, బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి జంగంపెల్లి రామస్వామి, బరుకుంటి రాజీవ్, కరాడి గంగన్న, దర్శనాల అశోక్, కొండమడుగు గణేష్, బడుగు రాజేశ్వర్, సర్కిల్ నరేష్, అగ్గిమల్ల నవీన్, సాయికుమార్, దర్శనాల ప్రతాప్, బండారి సంతోష్, అన్నెల లక్ష్మణ్, గొంటి ముక్కుల ఓమన్న, రామెల్లి సురేష్ పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపుకు ఏర్పాట్లు పూర్తి



ఈవీఎంల రికార్డులను పరిశీలిస్తున్న నిర్మల్ కలెక్టర్

నవతెలంగాణ-నిర్మల్

రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్యా జిల్లాలోని మూడు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంల తరలింపుకు ఏర్పాట్లు పూర్తి అయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఈవీఎం గోడౌన్ నుంచి మూడు నియోజకవర్గాలకు పంపిణీ కేంద్రాలకు ఈవీఎం, సీయూ, వీవీప్యాట్‌లు తరలింపు కోసం వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదాంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను గతంలో పూర్తిచేసుకోగా, ప్రస్తుతం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేసుకోవడం జరుగుతుందన్నారు. ఆ తరువాత నియోజకవర్గాల వారిగా నిర్మల్ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియం, ఖానాపూర్‌లోని కేబీ కాంప్లెక్స్, ముధోల్‌లోని రెసిడెన్షియల్ స్కూల్‌లో ఏర్పాటు చేసుకున్న డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపరచడం జరుగుతుందని తెలిపారు. అబ్జర్వర్ పర్యవేక్షణలో రెండవ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ లోకేష్, ఆయా పార్టీల నాయకులు రత్న కల్యాణి, దివాకర్, కోమల్ రెడ్డి, సిరికొండ రమేష్, గంద్రత్ రమేష్, కొరిపెల్లి శ్రావణ్ రెడ్డి, ఎస్ఎన్ రెడ్డి, గాజుల రవికుమార్, సయ్యద్ హైదర్, సయ్యద్ మజర్, ఎలక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న అనిల్ జాదవ్



నవతెలంగాణ-తాంసి

దుర్గామాత ఆశీస్సులు అందరిపై ఉండి సుఖసంతోషాలతో ఉండాలని బోథ్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం రాత్రి పొన్నారి గ్రామంలోని దుర్గా దేవి విగ్రహానికి డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజరెడ్డితో కలిసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. గ్రామస్తులు మండపం ఆవరణలో మహిళలకు వెయ్యి దీపోత్సవం వెలిగించి, సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అనిల్ జాదవ్‌కు స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామ గ్రామాన దుర్గాదేవి, శారదాదేవి విగ్రహాలను ప్రతిష్టించడం జరిగిందన్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజులు మహిళలు గ్రామస్తులు ప్రతిరోజు పూజ కార్యక్రమాలు నిర్వహిస్తూ గ్రామాలలో పండగ వాతావరణంగా ఉందన్నారు. శారదామాత, దుర్గాదేవి, ఆశీస్సులు మన అందరిపై ఎల్లవేళలా ఉండాలని వారి ఆశీస్సులతో బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నన్ను దీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ ముచ్చరేఖారఘు, నాయకులు రమణ, కృష్ణ, లింగారెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హ్యాట్రిక్ కలలు కంటున్న కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

వచ్చే ఎన్నికల్లోనూ గెలిచి హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కావాలని కలలు కంటున్న కేసీఆర్‌కు ప్రజలు గుణపాఠం చెప్పాలని నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. సారంగాపూర్ మండలంలోని మలక్‌చించోలి, కంకేట, జామ్ దుప్యా తండా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు జడ్పీటీసీ రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీహరిరావు నివాసంలో శనివారం హస్తం గూటికి చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ అధినాయకురాలు సోనియాగాంధీ సహకారంతోనే తెలంగాణ సిద్ధించిందని, రాష్ట్రం వస్తే తమ బతుకులు మారుతాయని ఆశించిన ప్రజలకు, ఉద్యోగాలు వస్తాయని చూసిన యువతకు నిరాశే ఎదురైందన్నారు. తెలంగాణ కోసం ఉద్యమించిన నాయకులందరూ బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి కేసీఆర్‌ను గద్దేదించాలని కోరారు. నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి దోచుకోవడమే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కబ్జాల మంత్రి, సండే మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి బుద్ధి చెప్పాలని అన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శ్రీహరిరావు సమక్షంలో పార్టీలో చేరుతున్న గ్రామస్తులు